PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 235 | విజయవాడ, శనివారం 30 మార్చి 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 30 March 2024 | Rs

## జల'కళ' ఏదీ?

- బిల్లులు రాక పనులు ఆపేసిన కాంట్రాక్టర్లు
- 12 శాతం లక్ష్యం దాటని బోర్లు

3

## కూల్‌గా కొట్టేశారు..

- బెంగళూరుపై ఏడు వికెట్ల తేడాతో కోల్‌కతా గెలుపు

6

### లైంగిక వేధింపులతో

# విద్యార్థిని ఆత్మహత్య!

- ఫ్యాకల్టీనే కారణమంటూ కుటుంబీకులకు మెసేజ్
- 'కొమ్మాది చైతన్య'లో ఘటన
- అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు

**ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో, మధురవాడ**

విశాఖ నగర శివారు కొమ్మాది వద్దగల చైతన్య ఇంజనీరింగ్ అండ్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని గురువారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. తమ కాలేజీ ఫ్యాకల్టీ లైంగిక వేధింపులే తన ఆత్మహత్యకు కారణమని ఆ విద్యార్థిని తన కుటుంబీకులకు వాట్సాప్ మెసేజ్ పంపింది. తన ఫొటోలు తీసి బ్లాక్ మెయిల్‌కు పాల్పడడంతో తీవ్ర మానసిక క్షోభ అనుభవించినట్టు అందులో పేర్కొంది. ఈ ఆత్మహత్య ఘటన విశాఖను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. దర్యాప్తు తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. విద్యార్థిని కుటుంబసభ్యుల కథనం ప్రకారం... అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన 16 ఏళ్ల విద్యార్థిని కొమ్మాదిలోని చైతన్య ఇంజనీరింగ్ అండ్ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి ఏడాది డిప్లొమో చదువుతోంది. ఆమె ఆత్మహత్య చేసుకునే ముందు తన సెల్‌ఫోన్ నుంచి వాట్సాప్ ద్వారా గురువారం రాత్రి తన తండ్రికి, అక్కకు మెసేజ్ పంపింది. 'నేను సూసైడ్ చేసుకోవడానికి కారణం ఏమిటంటే ఈ కాలేజీలో సెక్స్‌వల్ హెరాస్‌మెంట్ జరుగుతోంది నాన్నా. మరి ఫ్యాకల్టీకి చెప్పొచ్చు కదా అని మీరు అనొచ్చు. కానీ, ఆ ఫ్యాక్టల్టీయే అందులో ఒకరు అని అంటే ఇంకేం చెప్పగలం. చాలా చండాలంగా బిహేవ్ చేస్తున్నారు. స్టూడెంట్స్‌కి ఫ్యాకల్టీ చెప్పాల్సింది పోయి ఆ ఫ్యాకల్టీయే ఆ స్టూడెంట్స్‌ని ఎంకరేజ్ చేస్తుంటే ఇంక ఎవరికి చెప్పాలి. నా ఫొటోస్ కూడా తీసుకుని బెదిరిస్తున్నారు. నాకు ఒక్కదానికే కాదు ఇంకా కాలేజీలో చాలామంది అమ్మాయిలు ఉన్నారు. ఎవరికీ చెప్పుకోలేక, అలా అని కాలేజ్‌కి వెళ్లలేక మధ్యలో నలిగిపోతున్నాం. పోలీస్ కంప్లైంట్ ఇచ్చినా, ఏం చేసినా మా ఫొటోస్ వెంటనే సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తామని బెదిరిస్తున్నారు. నాకు వేరే దారి కనిపించడం లేదు. ఎవరో ఒకరు చస్తేనే ఈ విషయం బయట ప్రపంచానికి తెలుస్తుంది. ఆ పని నేనే చేస్తున్నాను. నీకు మంచి కూతురుని కాలేకపోయినందుకు ఐయామ్ రియల్లీ సారీ నాన్నా' అని ఆ మెసేజ్‌లో ఉంది. దీన్నిబట్టి లైంగిక వేధింపుల కారణంగానే ఆ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు అర్థమవుతోంది. ఆ మెసెజ్‌ను చూసిన వెంటనే విద్యార్థిని కుటుంబసభ్యులు అత్యవసర నెంబర్ 100కు ఫోన్ చేసి విషయం చెప్పారు. పోలీసులు కాలేజీ హాస్టల్‌కు వచ్చారు. అప్పటికే ఆవరణలో పడి ఉన్న విద్యార్థినిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయినా, ఫలితం లేకపోయింది. సదరు విద్యార్థిని హాస్టల్ నాల్గో అంతస్తు మేడపై నుంచి దూకిందా? లేక విషం ఏదైనా తీసుకుందా? అనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మేడపైనుంచి దూకితే కింద రక్తం ఉంటుందని, అలాంటిదేమీ అక్కడ లేదని తోటి విద్యార్థినులు చెబుతున్నారు. ప్రస్తుతం విద్యార్థిని మృతదేహం విశాఖ కెజిహెచ్‌లో ఉంది. విద్యార్థి బంధువుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని పిఎం పాలెం పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చాక వాస్తవాలు వెల్లడి కానున్నాయని చెప్పారు. గురువారం రాత్రి విద్యార్థిని తన తండ్రి, అక్కకు పంపిన మెసేజే ఆధారమా? ఇంకా ఏమైనా ఆధారాలు ఉన్నాయా? అన్నది తెలియాల్సి ఉంది. రెండు రోజులుగా ఆ విద్యార్థిని ముభావంగా ఉంటోందని తోటి విద్యార్థులు చెబుతున్నారు. గురువారం ఉదయం ఆమె కాలేజీకి వెళ్లలేదని, స్టడీ అవర్‌కు హాజరు కాలేదని తెలుస్తోంది. ఉదయం వాష్ రూమ్‌లోకి వెళ్లిన తరువాత నుంచీ ఆమె కనిపించలేదు. దీంతో, తల్లిదండ్రులకు మిగతా 5లో

## బీహార్‌లో కుదిరిన 'ఇండియా' సీట్ల సర్దుబాటు

- ఆర్‌జెడి 26.. కాంగ్రెస్ 9.. వామపక్షాలు 5 సీట్లలో పోటీ

**పాట్నా :** పద్దెనిమిదో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీహార్‌లో 'ఇండియా' వేదిక భాగస్వాముల మధ్య సీట్ల సర్దుబాటు ఖరారైంది. రాష్ట్రంలోని మొత్తం 40 లోక్‌సభ సీట్లకు గాను ఆర్‌జెడి 26 స్థానాల్లో పోటీ చేయనుండగా, కాంగ్రెస్-9, వామపక్షాలు ఐదు స్థానాల్లో పోటీచేయనున్నాయి. ఖగారియా స్థానాన్ని సిపిఐ(ఎం)కు కేటాయించగా, బెగుసరాయ్ స్థానాన్ని సిపిఐకి, ఆరా, కరకట్, నలందా స్థానాలను సిపిఐ(ఎంఎల్)కు కేటాయించారు. ఇండియా బ్లాక్‌లోని భాగస్వామ్య పార్టీల నేతలు శుక్రవారం నాడిక్కడ విలేకరుల సమావేశం లో ఈ సీట్ల సర్దుబాటు గురించి ప్రకటించారు. జెడి(యు) సిట్టింగ్ స్థానాలైన పూర్ణియా, కటిహార్ సీట్ల విషయమై ఆర్‌జెడి, కాంగ్రెస్‌ల మధ్య ప్రతిష్టంభన తొలగిపోయింది. పూర్ణియాను ఆర్‌జెడికి కాంగ్రెస్ వదులుకున్నది. అయితే, ఈ స్థానం నుంచి పోటీ చేయాలని ఇటీవలే కాంగ్రెస్‌లో తన పార్టీ జన్ అధికారి పార్టీ (జెఎపి)ని విలీనం చేసిన పప్పు యాదవ్ పట్టుబట్టారు.. ఆయన ఆ సీటును వదులుకోవటానికి సిద్ధంగా కనిపించటం లేదు. ఎన్డీయేలోని కూటమిలో బిజెపి 17, జెడియు 16, జీతన్‌రామ్ మాంఝీ నేతృత్వం లోని హిందుస్థానీ ఆవామ్ మోర్చా (హెచ్‌ఎఎం) 1, రాష్ట్రీయ లోక్‌సమతా పార్టీ (ఆర్‌ఎల్‌ఎస్‌పీ) 1, చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (ఎల్జేపీ) మిగిలిన ఐదు స్థానాల్లో పోటీ చేయనున్న సంగతి తెలిసిందే.

2019 లోక్‌సభ ఎన్నికల్లో బీహార్‌లో కాంగ్రెస్ ఒక్కస్థానంలో విజయం సాధించింది. ఆర్‌జెడి ఖాతా తెరవలేదు. బిజెపి17, జెడియు 16 సీట్లను గెలుచుకున్నాయి. నితీశ్ జెడియు తిరిగి ఎన్డీయే కూటమిలోకి చేరటంతో రాష్ట్రంలో ఆయనపై తీవ్ర వ్యతిరేకత ఉన్నది.

# సీన్ రివర్స్

- బతకడానికి పల్లెబాట
- పొమ్మంటున్న బస్తీలు
- మూడు సంవత్సరాల్లో 5.60 కోట్ల మంది వెనక్కి

**ప్రజాశక్తి - న్యూఢిల్లీ**

'కూటి కోసం, కూలీ కోసం ..పట్టణంలో బతుకుదామని ... తల్లిమాటలు చెవిన పెట్టక... బయలుదేరిన బాటసారికి...' అంటూ మహాకవి శ్రీశ్రీ రాసిన కవిత గుర్తుంది కదూ! ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. పాలకుల విధానాల పుణ్యమా అని బస్తీలు బతుకు నివ్వడం మానేశాయి. దీంతో పొట్ట చేతపట్టుకుని పల్లె బాట పడుతున్న వారి సంఖ్య ఏటికేడాది పెరుగుతోంది. మూడు సంవత్సరాల కాలంలో దేశ వ్యాప్తంగా 5.60 కోట్ల మంది పట్టణాల నుండి పల్లెలకు చేరారు. ఉపాధి కోసం వ్యవసాయాన్ని ఆశ్రయించారు. ఇది దేశ విభజన సమయంలో జరిగిన వలసకల కన్నా ఎక్కువ! ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌ఓ) ఇటీవల విడుదల చేసిన 'ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్టు-2024' ఈ విషయాన్ని ధృవీకరించింది. ఐఎల్‌ఓతో పాటు, ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్, ఢిల్లీకి చెందిన ఎన్‌జిఓ ఇండియన్ సొసైటీ ఆఫ్ లేబర్ ఎకనామిక్స్ కలిసి 2020-2022 కాలానికి ఈ నివేదికను రూపొందించాయి. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేలు, జాతీయ నమూనా సర్వేలు తదితర ప్రభుత్వ గణాంకాలే ఈ నివేదికకు ఆధారంకావడం గమనార్హం.

**కరోనాతో ప్రారంభం...**

మోడీ ప్రభుత్వ నిర్వాకం కారణంగా కరోనా సమయంలో వలసకార్మికుల సుదీర్ఘపాదయాత్రలను దేశం చూసింది. నిజానికి పెద్దనోట్ల రద్దు సమయంలోనే కార్పొరేట్ల ఈ వైఖరి కనిపించినప్పటికీ, కరోనా సమయంలో అది మరింత స్పష్టంగా కనిపించింది. నగరాలు, పట్టణాల్లో పట్టించుకునే దిక్కు లేకపోవడంతో కరోనా విజృంభించిన 2020వ సంవత్సరంలో మూడు కోట్ల మందికిపైగా పల్లెలకు చేరినట్లు ఐఎల్‌ఓ తెలిపింది. ఆ ఏడాది వ్యవసాయం, అనుబంధ రంగాల్లో కార్మికుల సంఖ్య 3.80 కోట్ల మంది పెరిగారు.

**కొనసాగిన వలసలు...**

ఆ తరువాత కూడా గ్రామాలకు వలసలు కొనసాగాయి. 2021వ సంవత్సరంలో వ్యయసాయ రంగంలో 1.21 కోట్ల మంది కార్మికులు పెరిగారు. 2022లో 1.29 కోట్ల మంది ఇలా పల్లెలకు చేరారు. అంతకుముందు వృద్ధులతో పాటు యువకులు కూడా వ్యవసాయం నుండి బయటకు వచ్చేవారు. 2000-2019 సంవత్సరాల మధ్య ఈ పరిస్థితి స్పష్టంగా కనిపించింది. ఇప్పుడు మళ్లీ పల్లెలో వ్యవసాయ పనుల్లోకి యువత చేరుతున్నట్లు ఐఎల్‌ఓ తెలిపింది. 'వ్యవసాయ రంగం వెలువల పని అవకాశాలు లేకపోవడం, మహమ్మారి కారణంగా ఆర్థిక మందగమనం కారణంగా ప్రజలు వెనక్కి వెడుతున్నారు' అని నివేదికలో పేర్కొన్నారు. వీరిలో పెద్ద సంఖ్యలో కూడా మహిళలు కూడా ఉన్నట్లు ఐఎల్‌ఓ తెలిపింది. '2000-2019 కాలంలో శ్రామిక శక్తిలో పురుషుల కంటే మహిళల వాటా తక్కువగా ఉంది. కానీ 2019-2022 మధ్య గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి తారుమారైంది' అని కూడా ఈ నివేదికలో పేర్కొన్నారు. దీని ప్రకారం 'పురుషుల కంటే మహిళలు వ్యవసాయరంగంలోకి పెద్ద సంఖ్యలో చేరారు. 2022లో వ్యవసాయంలో పనిచేస్తున్న పురుషుల శాతం 38.1 కాగా, మహిళల సంఖ్య 62.8శాతం' అని నివేదిక పేర్కొంది. పురుషులు పట్టణాల్లో పనుల కోసం వెతుకుతుంటే మహిళలు గ్రామాలకు చేరి ఉండవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే విధంగా ఉపాధి కార్మికులు, నిర్మాణరంగ కార్మికులు పెద్దసంఖ్యలో గ్రామాలకు వచ్చి ఉంటారని ఐఎల్‌ఓ నివేదికలో పేర్కొన్నారు

### అభివృద్ధా ... తిరోగమనమా!

పల్లెల నుండి జనం పట్టణాలకు వలసరావడం, పారిశ్రామిక ఉత్పత్తిలో భాగం కావడాన్ని అభివృద్ధిగా భావిస్తారు. ఇప్పటికే అభివృద్ధి చెందిన దేశాలతో పాటు, అభివృద్ధి చెందుతున్న దేశాల గణాంకాలు కూడా ఇదే విషయాన్ని చెబుతాయి. మన దేశం కూడా అదేమాదరి వ్యవసాయ శ్రామిక శక్తిని వ్యవసాయేతర రంగాలకు మార్చడానికి ఎంతగానో ప్రయత్నించింది. నగరాలు, పట్టణాల కేంద్రంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించింది. ఫలితంగా మహానగరాలు, విశ్వనగరాలు ఆవిర్భవించాయి. బతకడానికి వచ్చిన పల్లెజనం కార్మికులుగా స్థిరపడ్డారు. వారితో పాటే పేదరికం స్థిరపడింది. అంతరాలు పెరిగాయి. ఉపాధి లేక, పల్లెలకు బస్తీ జనం పోలోమంటున్నారు. బతకడం కోసం పేదలు ఇలా పల్లెబాట పట్టడాన్ని అభివృద్ధి అంటారా తిరోగమనం అంటారా?

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు సభలో అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్

# 58 నెలల్లో విప్లవాత్మక మార్పులు

- మీ ప్రభుత్వానికి రాఖీ కట్టండి
- ఇవి ప్రజల భవిష్యత్ నిర్ణయించే ఎన్నికలు
- చేసిన మంచితో మీ ముందుకు వస్తున్నాం
- 'మేమంతా సిద్ధం' సభలో ముఖ్యమంత్రి జగన్

**ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి**

గత 58 నెలల పాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర శుక్రవారం కర్నూలు జిల్లాలో సాగింది. పెంచికలపాడు నుండి బస్సు యాత్ర ప్రారంభమైంది. కోడుమూరులో జగన్ చేనేతలతో మాటామంతీ నిర్వహించారు. కైరవాడి, గోనేగండ్ల, రాళ్లదొడ్డి మీదుగా ఎమ్మిగనూరు వరకు యాత్ర సాగింది. ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ మైదానంలో జరిగిన బహిరంగ సభలో జగన్ మాట్లాడుతూ అక్కచెల్లెమ్మలకు మేలు చేసిన ఈ ప్రభుత్వానికి, దిశ యాప్ ద్వారా భద్రత ఇచ్చిన మీ ప్రభుత్వానికి అక్కచెల్లెమ్మలు రాఖీ కట్టాలని కోరారు. ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యే, ఎంపీలను ఎన్నుకునే ఎన్నికలు కావని, ప్రజల, పిల్లల భవిష్యత్తు నిర్ణయించే ఎన్నికలని పేర్కొన్నారు. పెత్తందారులను ఓడించేందుకు, ప్రజల పక్షాన నిలబడేందుకు తాను సిద్ధమని, మీరు సిద్ధమా? అని ప్రశ్నించారు. విద్యా రంగంలో కనివినీ ఎరుగని మార్పులు తెచ్చామన్నారు. పిల్లల చదువుల మీద ధ్యాస పెట్టిన ప్రభుత్వాన్ని గతంలో ఎప్పుడైనా చూశారా? అని ప్రశ్నించారు. పిల్లల భవిష్యత్ కోసం యుద్ధం చేయడానికి అంతా సిద్ధమా? అని అన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన తమకు, రైతు వ్యతిరేక కూటమికి మధ్య యుద్ధం మిగతా 5లో

## టిడిపిలో నిరసన జ్వాలలు

- అనంతపురంలో పార్టీ కార్యాలయంపై దాడి
- గుంతకల్లులో చంద్రబాబు చిత్రపటాలకు నిప్పు
- రాజంపేటలో కరపత్రాలు దగ్ధం

## టిడిపి తుది జాబితా విడుదల

- గంటా, కళాకు దక్కిన చోటు
- గుంతకల్లు నుంచి మాజీ మంత్రి జయరాం

లోపలి పేజీలో..

### వామపక్షాలు కాంగ్రెస్ భేటీ

# చర్చలు అసంపూర్ణం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి-టిడిపి- జనసేన కూటమిని, నిరంకుశ వైసిపిని ఓడించేందుకు కాంగ్రెస్, వామపక్షాల మధ్య సీట్ల సర్దుబాట్లపై శుక్రవారం జరిగిన చర్చలు అసంపూర్ణంగా ముగిశాయి. సీట్ల సర్దుబాట్లు, ప్రజాసమస్యలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించేందుకు శుక్రవారంనాడు హైదరాబాద్ లోటస్ పాండ్‌లోని వైఎస్ షర్మిల నివాసంలో కాంగ్రెస్ నేతలు కొప్పుల రాజు, రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజులతో సిపిఎం, సిపిఐ రాష్ట్ర నాయకులు విడివిగా సమావేశమయ్యారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు ఓబులేశుచర్చల్లో పాల్గొన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పార్టీల బలాబలాలతోపాటు గతంలో పోటీ చేసిన అనుభవాలు, పొందిన ఓటింగ్, ప్రస్తుత పరిస్థితి, ప్రత్యర్థి పార్టీల వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు. సిపిఎం ఒక పార్లమెంటు సీటు, పది అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయాలని ప్రతిపాదించగా చర్చల్లో ఆరు అసెంబ్లీ స్థానాలతోపాటు ఒక పార్లమెంట్ స్థానంపై ఏకాభిప్రాయం కుదిరింది. సిపిఐ 11 అసెంబ్లీ స్థానాలతోపాటు ఒకటి లేదా రెండు పార్లమెంట్ స్థానాలను కోరగా రెండు, మూడు స్థానాలు మినహా మిగిలిన స్థానాలపై ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలిసింది. రాష్ట్రంలో స్థానిక పరిస్తితులను అంచనా వేసిన తర్వాత మరోసారి సమావేశం కావాలని మూడు పార్టీలు నిర్ణయించాయి. బిజెపి, వైసిపిలను ఓడించడమే పొలిటికల్ అజెండాగా వామపక్ష పార్టీలతో సమావేశమయ్యాయని ఆంధ్రప్రదేశ్ పిసిసి మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు తెలిపారు. వామపక్ష పార్టీలతో మున్ముందు కూడా కలిసి పనిచేస్తామని చెప్పారు. ఎవరెక్కడ పోటీ చేస్తారనే విషయంలో అతి త్వరలో ఉమ్మడి ప్రకటన వస్తుందని ఆయన తెలిపారు.

## మోడీ విధానాలతో దేశంలో తీవ్ర సంక్షోభం

- ప్రముఖ రాజకీయ, ఆర్థిక నిపుణులు పరకాల ప్రభాకర్

2

# కేజ్రీవాల్ అరెస్టుపై స్పందించిన ఐరాస

- ప్రజల హక్కుల రక్షణపై ఆశాభావం

**న్యూఢిల్లీ :** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుపై ఐక్యరాజ్యసమితి స్పందించింది. భారత్‌లో సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరుగుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. కేజ్రీవాల్ అరెస్టుపై పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ బదులిస్తూ 'భారత్ సహా ఎన్నికలు జరిగే ఏ దేశంలో అయినా రాజకీయ, పౌర హక్కులు సహా ప్రజలందరి హక్కులకు రక్షణ లభిస్తుందని మేము ఆశిస్తున్నాము. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత వాతావరణంలో ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరుకుంటున్నాము' అని చెప్పారు.

గుటెరస్ ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్

కేజ్రీవాల్ అరెస్టుపై అమెరికా, జర్మనీ ఇదివరకే స్పందించాయి. స్వేచ్ఛగా, పారదర్శకంగా, సకాలంలో చట్టపరమైన ప్రక్రియ జరగాలని తాను భావిస్తున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ వ్యాఖ్యానించారు. తన బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేశారని, దీంతో ఎన్నికల ప్రచారం నిర్వహించడం సవాలుగా మారిందని కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణల గురించి కూడా తమకు తెలుసునని మిల్లర్ పేర్కొన్నారు.

కేజ్రీ అరెస్టుపై జర్మనీ స్పందిస్తూ 'న్యాయ వ్యవస్థ స్వతంత్రత, మౌలిక ప్రజాస్వామిక సూత్రాలకు సంబంధించిన ప్రమాణాలు ఈ కేసుకు కూడా వర్తిస్తాయని మేము భావిస్తున్నాం' అని పేర్కొంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇతర వ్యక్తుల మాదిరిగానే కేజ్రీవాల్ కూడా నిష్పాక్షిక, స్వేచ్ఛాయత విచారణకు అర్హుడని వ్యాఖ్యానించింది. దేశీయంగానే గాకుండా అంతర్జాతీయంగా కూడా విమర్శలు వస్తుండడంతో బిజెపితీవ్ర ఇరకాటంలో పడింది. దీంతో అది బుకాయింపులు, ఎదురుదాడికి దిగింది.

## కాంగ్రెస్‌కు ఐటి నోటీసులు

**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆదాయపు పన్ను (ఐటి) విభాగం కాంగ్రెస్‌కు మరోసారి నోటీసులు జారీ చేసింది. గత సంవత్సరాల్లో పన్ను రిటర్న్‌ల్లో వ్యత్యాసాల కారణంగా రూ.1823 కోట్ల డిమాండ్ నోటీసులు ఈ వారం ప్రారంభంలో జారీ చేసింది. ఈ విషయాన్ని పార్టీ కోశాధికారి అజయ్ మాకెన్, ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ శుక్రవారం మీడియా సమవేశంలో తెలిపారు. 2017-18, 2020-21 మదింపు సంవత్సరాలకు సంబంధించి పన్ను రిటర్న్‌ల్లో వ్యత్యాసాల కారణంగా ఈ తాజా నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. 'ఆదాయపన్ను శాఖ నుంచి కాంగ్రెస్‌కు రూ. 1823 కోట్ల డిమాండ్ నోటీసు వచ్చింది. కేవలం సీతారాం కేసరి అధ్యక్షుడిగా ఉన్న సమయంలోని 1993-94 ఏడాదికే డిమాండ్‌ను రూ. 53 కోట్లకు పెంచారు' అనిఎఐసిసి ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అజయ్ మాకెన్ తెలిపారు. 'ఆదాయపన్ను శాఖ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడుతుంది. బిజెపి రూ. 4,600 కోట్ల పెనాల్టీ చెల్లించాలి' అని అన్నారు. ఈ విషయంలో వచ్చే వారం ప్రారంభంలో సుప్రీంకోర్టును కాంగ్రెస్ ఆశ్రయిస్తుందని చెప్పారు. బిజెపి ట్యాక్స్ తీవ్రవాదానికి పాల్పడుతుందని జైరాం రమేష్ ఆరోపించారు.

# రాజధాని లేకుండా చేసిన జగన్

బనగానపల్లె సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

- కర్నూలు న్యాయరాజధాని ఏమైందని?
- పేదలందరికీ ఉచితంగా ఇళ్లు కట్టించి ఇస్తాం
- 'ప్రజాగళం' సభల్లో చంద్రబాబు

**ప్రజాశక్తి- యంత్రాంగం**

ఐదేళ్ల వైసిపి పాలనలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని, కర్నూలుకు న్యాయరాజధాని ఏమైందని టిడిపి అధినేత నారా చంద్రబాబు ప్రశ్నించారు. మద్యం, ఇసుకలో సంపాదించిన డబ్బులతో ఓట్లను కొనాలని ముఖ్యమంత్రి జగన్ చూస్తున్నారని, ఎంత డబ్బు ఖర్చు పెట్టినా ఆయనను ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. తాము అధికారంలోకొస్తే పేదలకు ఉచితంగా ఇళ్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారు. 'ప్రజాగళం' పేరుతో నంద్యాల జిల్లా బనగానపల్లె, నెల్లూరు జిల్లా కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో శుక్రవారం ఆయన రోడ్ షో నిర్వహించారు. బహిరంగ సభల్లో ప్రసంగించారు. కర్నూలుకు న్యాయ రాజధాని ఎందుకు రాలేదో ప్రజలు ఆలోచించాలన్నారు. టిడిపి హయాంలో ఓర్వకల్లులో పరిశ్రమల హబ్ కోసం, నందికొట్కూరు మండలం తంగడంచ వద్ద మెగా సీడ్స్ హబ్ కోసం, ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్స్ పరిశ్రమ కోసం భూములను కేటాయించామని గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వం వచ్చాక సీడ్స్ హబ్ వెనక్కి పోయిందన్నారు. మిగిలిన వాటిలో పరిశ్రమల ఏర్పాటు ఆశాజనకంగా లేదని వివరించారు. రూ.90 కోట్లతో కర్నూలులో విమానాశ్రయం ఏర్పాటు చేశామని తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాల్లో వైసిపిని గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి ఏమి చేశారని ప్రశ్నించారు. రాయలసీమ ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. తాము అధికారంలోకొస్తే యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇస్తామని, ఇంట్లో కూర్చొని అమెరికా కంపెనీల్లోనూ, విదేశీ కంపెనీల్లోనూ పని చేస్తూ జీతాలు తీసుకునేలా కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. వలంటీర్లను తొలగించబోమని, వారి చదువు, నైపుణ్యాన్ని బట్టి నెలకు రూ.50 వేలు సంపాదించేలా చర్యలు తీసుకుంటామన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో నాపరాయి పరిశ్రమను కాపాడుతానని హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకే పవన్ కల్యాణ్‌లోనూ, మిగతా 5లో

## దళితులను అవమానించడం తగదు

- ఎంపి నందిగం సురేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెత్తందారీ పోకడలతో చంద్రబాబు.. దళితులను వేలిముద్రగాళ్లని, టిప్పర్ డ్రైవర్ అని కించపరిచేలా మాట్లాడటం తగదని బాపట్ల ఎంపి నందిగం సురేష్ విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కులదురహంకారంతో శింగనమల వైసిపి అభ్యర్థి రామాంజనేయులును ఉద్దేశించి వేలిముద్రగాడు, టిప్పర్ డ్రైవర్ అని అవహేళన చేస్తూ చంద్రబాబు మాట్లాడటం తగదన్నారు. దళితులను అవమానిస్తున్న చంద్రబాబుకు ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని అన్నారు.

## అవినీతిపరులపై చర్యలు ఏవీ?

- నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ఐదేళ్ల పాలనలో అవినీతిపరులపై చర్యలు తీసుకున్న దాఖలాల్లేవని జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ విమర్శించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసిపి పాలనలో అవినీతిపై టోల్ ఫ్రీ నెంబరు 14400కు 8,03,612 ఫిర్యాదులు అందాయని, ఇందులో మంత్రులు, వారి పేషీలపై 2 లక్షలకు పైగా ఫిర్యాదులు అందాయని, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై 4.39 లక్షల ఫిర్యాదులు ప్రజల నుంచి వెళ్లాయని అన్నారు. లక్షల్లో ఫిర్యాదులు అందినా సిఎం జగన్ తీసుకున్న చర్యలు శూన్యం అని చెప్పారు. రాష్ట్రంలో అవినీతి నిర్మూలనకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అలహాబాద్ ఇచ్చిన నివేదికకు వైసిపి ప్రభుత్వం తొక్కి పెట్టిందన్నారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501**కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

## రూ.18.50 లక్షలు పట్టివేత

ప్రజాశక్తి తెనాలి (గుంటూరు జిల్లా)

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో శుక్రవారం రూ.18.50 లక్షల నగదును శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నియమాళికి విరుద్ధంగా తరలిస్తున్న నగదును సీజ్ చేశారు. గుంటూరు జిల్లా తెనాలి రూరల్ పరిధిలోని సంఘం జాగర్లమూడి చెక్‌పోస్ట్ వద్ద గురువారం అర్ధరాత్రి ఓ కారులో రూ.లక్ష నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఉదయం చెంచుపేటలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఓ కారులో రూ.3.50 లక్షల నగదును పట్టుకున్నారు. అన్నమయ్య జిల్లా చిట్వేలు మండల పరిధిలోని ఆనుంపల్లి చెక్‌పోస్టు వద్ద ఓ వాహన తనిఖీ చేయగా అందులోని వ్యక్తుల నుంచి రూ.14 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పశువులు, మేకలను సంతలో విక్రయించి తీసుకువెళ్తున్న నగదును కాపలాదారుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## విద్యార్థుల జీవితాలతో చెలగాటం

- మాజీ ఎంపి కంభంపాటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెప్పు పొందేందుకు విద్యాశాఖ అధికారులు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని టిడిపి మాజీ ఎంపి కంభంపాటి రామ్మోహన్‌రావు విమర్శించారు. విద్యాశాఖ నిధులు రూ.వెయ్యికోట్లను దారి మళ్లించి విద్యాశాఖను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అర్ధరాత్రి వీడియోకాన్ఫరెన్స్‌లు నిర్వహించి పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్.. ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. మూతపడే బైజూస్ సంస్థకు రూ.500 కోట్లు దారాదత్తం చేసి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. ఉన్నత విద్యామండలి కార్యాలయాన్ని ఛైర్మన్ హేమచంద్రారెడ్డి వైసిపి కార్యాలయంలా మార్చారని ఆరోపించారు.

## కిమిడి నాగార్జున రాజీనామా

ప్రజాశక్తి - చీపురుపల్లి

టిడిపి విజయనగరం పార్లమెంటు అధ్యక్ష పదవికి, చీపురుపల్లి నియోజకవర్గ అధ్యక్ష పదవికి శుక్రవారం కిమిడి నాగార్జున రాజీనామా చేశారు. చీపురుపల్లి నుంచి టికెట్ కేటాయించకపోవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తన భవిష్యత్తు కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తానని తెలిపారు. నాగార్జునకు కాకుండా కళా వెంకటరావుకు సీటు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ టిడిపి కార్యకర్తలు, నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. నెల్లిమర్ల అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశమై తాను ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు.

## మోడీ విధానాలతో

# దేశంలో తీవ్ర సంక్షోభం

- జిడిపి లెక్కలన్నీ వండి వార్చేవే
- ఉద్యోగాలు, ఉపాధి లేక కుటుంబాలు కూలిపోతున్నాయి
- రాష్ట్రాలను ఊపిరి సలపనీయకుండా నులిమేస్తున్నారు
- ప్రముఖ రాజకీయ, ఆర్థిక నిపుణులు పరకాల ప్రభాకర్

ఐలు సదస్సులో ప్రసంగిస్తున్న పరకాల ప్రభాకర్, వేదికపై కెఎస్ లక్ష్మణరావు, సుంకర రాజేంద్రప్రసాద్, చలసాని అజయ్‌కుమార్ తదితరులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రంలో బిజెపి మరోసారి అధికారంలోకి వచ్చి మోడీ ఆర్థిక విధానాలు ఇలాగే కొనసాగితే దేశంలో 'తీవ్ర సంక్షోభం' ఏర్పడుతుందని, ప్రభుత్వం మారకపోతే ప్రజాస్వామ్యంలో ఇవే చివరి ఎన్నికలు అవుతాయని ప్రముఖ రాజకీయ ఆర్థిక విశ్లేషకులు పరకాల ప్రభాకర్ అన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యాన 'సంక్షోభంలో నవభారతం, ఆర్థిక రాజకీయ పరిణామాలు' అనే అంశంపై శుక్రవారం బాలోత్సవ భవన్లో జరిగిన సెమినార్లో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వస్తే పార్లమెంటు సాక్షిగా ముస్లిము వ్యతిరేక ప్రకటనలు చేస్తారని, ఇప్పుడు మణిపూర్లో జరుగుతున్న ఘటనలు రాష్ట్రంలోకి, ప్రతి గ్రామంలోకి వస్తాయని తెలిపారు. ప్రజాస్వామ్యదేశంలో వచ్చే ఎన్నికలు ఆఖరివి కాకుండా ఉండాలంటే బిజెపిని ఓడించాలని ఆయన కోరారు. స్వాతంత్ర్య ఉద్యమంలో నూలుపోగంత పాత్ర లేనివారు నేడు దేశభక్తులమని చెప్పుకుంటూ మార్కెట్ చేసుకుంటున్నారని, నవభారతదేశంలో ఇదొక కొత్త లక్షణమని అన్నారు. ఇటీవల 35 వేల ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తే 1.25 కోట్ల దరఖాస్తులు వచ్చాయని, దీన్నిబట్టి సంక్షోభం ఎంత తీవ్రస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. గతిలేక కుటుంబాలను పోషించుకునేందుకు యుద్ధాలు జరుగుతున్న ఇజ్రాయిల్, ఉక్రెయిన్ సైతం వెళ్లి ప్రాణాంతక పనులు చేసేందుకు యువత సిద్ధపడుతున్నారని, సంక్షోభం తీవ్రతకు ఇది అద్దం పడుతుందని తెలిపారు. 'ఇక్కడ బతకలేక చచ్చేకంటే అక్కడకు వెళ్లి ఎంతోకొంత ఇంటికి పంపించి ఎన్నాళ్లుంటే అన్నాళ్లు బతికితే చాలని' ఇజ్రాయిల్, ఉక్రెయిన్ పోతున్న యువత చెబుతున్నారంటే మోడీ చెబుతున్న లెక్కలు ఎంత మోసపూరితమో, ఘోరమో అర్థం చేసుకోవచ్చని అన్నారు. 20-25 ఏళ్ల మధ్య వయసున్న వారిలో నిరుద్యోగం 42 శాతానికి చేరిందని పేర్కొన్నారు. నేటి భారతంలో ఉద్యోగం పొందడం అత్యంత కష్టతరమైందని సిఎస్‌డిఎస్ (సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్) నిర్వహించిన సర్వేలో తేలిందన్నారు. నిరుద్యోగం గురించి ప్రభుత్వాలు ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక సమాచారమూ ఇవ్వడం లేదని తెలిపారు. తనను ఫలానా వాళ్లు అన్నిసార్లు తిట్టారని కచ్చితమైన లెక్కలు చెప్పే మోడీకి కరోనా కాలంలో ఎంతమంది చనిపోయారో లెక్కతెలియదని, ఇంతకంటే అమానుషం ఇంకొకటి ఉండదని చెప్పారు. నిత్యావసర ధరలు పెరుగుతున్నాయని, ఆహార ద్రవ్యోల్బణం సగటున 20 శాతానికి చేరిందని, ఆదాయాలు లేక బతకలేని పరిస్థితుల్లో కుటుంబాలూ కూలిపోతున్నాయని పేర్కొన్నారు. అదే సమయంలో కార్పొరేట్ ట్యాక్స్ 19 శాతం తగ్గించారని, బ్యాంకుల నుండి ఆయా సంస్థలు తీసుకున్న రూ.25 లక్షల కోట్లను మాఫీ చేశారని, కేవలం రూ.2 లక్షల కోట్లు తిరిగి రాబట్టగలిగారని అన్నారు. దేశానికి రావాల్సిన పెట్టుబడులు 30 శాతం నుండి 19 శాతానికి తగ్గిపోయాయని, ఎఫ్‌డిఐలు క్రమంగా తగ్గిపోతున్నాయని చెప్పారు. ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు అనేది ప్రపంచంలోనే అతిపెద్ద కుంభకోణమని అన్నారు. రాష్ట్రాల హక్కులను హరించి వేస్తూ వాటి పీకనులిమేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేజ్రీవాల్‌పై ఆరోపణలు చేసిన వారు సాక్షులుగా బెయిల్‌పై బయట తిరుగుతున్నారని, ఆయన మాత్రం జైల్లో ఉన్నారని, దీనివెనుక ఎలక్టోరల్ బాండ్ల మహిమ ఉందని పేర్కొన్నారు. వీటన్నిటికీ వ్యతిరేకంగా దేశ ప్రజలను చైతన్యం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు.

సభకు అధ్యక్షత వహించిన ఐలు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. బిజెపి పాలకులు వారికి అనుకూలంగా చట్టాలను మారుస్తున్నారని, దేశ ద్రోహులు పాలకులైతే దేశభక్తులను ద్రోహులుగా ప్రచారం చేస్తారని మోడీ, బిజెపి చేస్తోందని అదేనని అన్నారు. దేశంలో న్యాయ రాజ్యాంగ వ్యవస్థల ధ్వంసం జరుగుతోందని, ప్రశ్నించేవారికి స్థానంలేని పరిస్థితిని సృష్టించారని పేర్కొన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాలు ప్రశ్నించేవారిపై కేసులు పెడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా చట్టాలు తీసుకొచ్చి దుర్మార్గమైన పాలన చేస్తున్నారని పేర్కొన్నారు. మోడీ చెప్పేవన్నీ అబద్ధాలేనని, నిరుద్యోగుల సంఖ్య పెరుగుతుండటం దీనికి నిదర్శనమని ఆయన అన్నారు. తొలుత వక్తలను బెజవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు సంపర దుర్గాశ్రీనివాసరావు వేదిక మీదకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసి నాయకులు నరహరిశెట్టి నరసింహారావు, ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు, ఆమ్ ఆద్మీ పార్టీ న్యాయవిభాగం నాయకులు చల్లగుండ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల వేతనం రూ.27 పెంచడం అన్యాయం

- ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉపాధి హామీ పథకం కింద కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలని కోరుతుంటే రూ.27 మాత్రమే పెంచడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి వెంకటేశ్వర్లు, దడాల సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 100 రోజుల పని 200 రోజులకు పెంచాలని, రోజుకూలీ రూ.600 ఇవ్వాలని కోరుతుంటే కేంద్రం పట్టించుకోకపోగా గతంలో ఇస్తున్న రూ.273కు రూ.27 కలిపి రూ.300 ఇస్తామని ప్రకటించడం అన్యామమని పేర్కొన్నారు. ధరలు ఆకాశాన్నంటుతుంటే మోడీ గద్దెనెక్కింది మొదలు నేటి వరకూ నిత్యావసర వస్తువుల ధరలు 4, 5 రెట్లు పెరిగాయని, వ్యవసాయ కూలీల ఆదాయం మాత్రం గొర్రెకు బెత్తెడు తోక అన్నట్లు ఉందని, ఏ మాత్రమూ పెరుగుదల లేదని అన్నారు. వ్యవసాయ కూలీలకు కనీస వేతనం చట్టం ప్రకారం రూ.400 చెల్లించాలని, కానీ మోడీ ప్రభుత్వం ప్రకటించిన వేతనం కనీస వేతన చట్టం కంటే తక్కువగా ఉందని తెలిపారు.

కనీస వేతనాలపై నియమించిన అనూప్ సత్పతి కమిటీ రోజుకు రూ.375 తక్కువ కాకుండా ఇవ్వాలని పేర్కొందని, ఆ కమిటీ సూచనను కూడా పట్టించుకోకుండా ఇంకా తక్కువ కూలీ చెల్లించాలని చెప్పడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకాన్ని ఎత్తేయాలని భూస్వామ్యవర్గం కార్పొరేట్ శక్తులు మోడీపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నాయని, ఈ ఒత్తిడికి తలొగ్గి మోడీ ప్రభుత్వం ఏదో ఒకవిధంగా ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయాలని చేస్తున్న కుట్రలో భాగంగానే ప్రతి సంవత్సరం ఈ పథకానికి నిధులు తగ్గిస్తున్నారని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని వారు కోరారు.

## కార్పొరేట్ల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలి

- లెనిన్ శత వర్ధంతి ఉత్సవాల సెమినార్‌లో వెంకట్రావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

సదస్సులో మాట్లాడుతున్న వెంకట్రావు

కామ్రేడ్ లెనిన్ స్ఫూర్తితో కార్పొరేట్ల దోపిడీకి వ్యతిరేకంగా కార్మిక, కర్షక పోరాటాలు ఉధృతం చేయాలని ప్రజాశక్తి మాజీ సంపాదకులు ఎస్ వెంకట్రావు కోరారు. లెనిన్ శత వర్ధంతి ఉత్సవాల సందర్భంగా సిపిఎం ఒంగోలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య భవన్‌లో 'సమకాలిన పరిస్థితులు- లెనిన్ సూత్రీకరణ' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకట్రావు మాట్లాడుతూ... ప్రపంచీకరణ, సరళీకరణ, ఆర్థిక విధానాల ద్వారా కార్పొరేట్లు, పాలకులు ఒకటై దేశ సంపదను దోచుకుంటున్నారని వివరించారు. కార్పొరేట్లను అధికార బిజెపి పెంచి పోషిస్తోందని విమర్శించారు. బిజెపి పాలనలో అన్ని రకాల వ్యవస్థలూ ధ్వంసం అయ్యాయని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అమ్మేస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వాలను శాసించే స్థాయికి కార్పొరేట్ శక్తులు ఎదిగాయని చెప్పారు. మతోన్మాద విస్తరణే అజెండాగా కేంద్రం పనిచేస్తోందని, ప్రజా సమస్యలను గాలికొదిలేసి కార్పొరేట్ల జపం చేస్తోందని విమర్శించారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం నానాటికీ పెరిగిపోతుందని వివరించారు. కార్మిక, కర్షక ఉద్యమాలను బలోపేతం చేయాలని, కేంద్రీకృత ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, రాష్ట్ర కమిటీ సభ్యులు వై.సిద్ధయ్య, జాలా అంజయ్య, ఒంగోలు నగర కార్యదర్శి జి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# టిడిపిలో నిరసన జ్వాలలు

- అనంతపురంలో పార్టీ కార్యాలయంపై దాడి
- గుంతకల్లులో చంద్రబాబు చిత్రపటాలకు నిప్పు
- రాజంపేటలో కరపత్రాలు దగ్ధం

అనంతపురం అర్బన్ కార్యాలయం వద్ద ఫర్నీచర్, కరపత్రాలను దగ్ధం చేస్తున్న ప్రభాకర్ చౌదరి మద్దతుదారులు

ప్రజాశక్తి-అనంతపురం , రాజంపేట అర్బన్

టిడిపిలో టికెట్ల వ్యవహారం చిచ్చు రాజేస్తోంది. తాజాగా విడుదల చేసిన జాబితాలో తమ నాయకుడి పేరు లేకపోవడంతో కార్యకర్తల్లో ఆగ్రహం కట్టలు తెచ్చుకుంది. పార్టీ కోసం కృషి చేసిన వారిని కాదని వేరొకరికి సీటు కేటాయించడంతో పలుచోట్ల తమ్ముళ్లుతిరగబడ్డారు. పార్టీ కార్యాలయంలోని ఫర్నీచర్లు, ఫ్లెక్సీలను తగలబెట్టారు. బిజెపి, జనసేనతో పొత్తులో భాగంగా వారికి సీట్లు కేటాయించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి, జనసేనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డబ్బుకోసం చంద్రబాబు నాయుడు టికెట్లను అమ్ముకున్నారని ఆరోపించారు.

అనంతపురం అర్బన్ సీటు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరికి కేటాయించకుండా దగ్గుపాటి వెంకటప్రసాద్‌కు కేటాయించడంతో ప్రభాకర్‌చౌదరి అనుయాములు మండిపడ్డారు. అనంతపురంలోని జిల్లా పార్టీ కార్యాలయం లోపలికెళ్లి ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. అనంతరం ఫ్లెక్సీలను, కరపత్రాలను తగలబెట్టారు. డబ్బులకు చంద్రబాబు టికెట్లు అమ్ముకున్నారని ఆరోపించారు. వైసిపి నుంచి ఇటీవలే పార్టీలో చేరిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంకు గుంతకల్లు టికెట్టు ఇవ్వడాన్ని స్థానిక మాజీ ఎమ్మెల్యే జితేందర్‌గౌడ్ అనుయాములు ఆగ్రహించారు. గుంతకల్లు టిడిపి కార్యాలయంలో ఫర్నీచర్‌కు నిప్పు పెట్టారు.

చంద్రబాబునాయుడు చిత్ర పటాలను దగ్ధం చేశారు. తమ అనుయాయులతో చర్చించి భవిష్యత్ కార్యచరణను ప్రకటిస్తామని ఇద్దరు నేతలూ ప్రకటించారు.

అన్నమయ్య జిల్లా రాజంపేట అసెంబ్లీ టికెట్‌ను టిడిపి సీనియర్ నాయకులు పాలకొండరాయుడు తనయుడు సుగవాసి సుబ్రహ్మణ్యానికి టికెట్ కేటాయించడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ పార్లమెంటు అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగలరాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. టిడిపి కరపత్రాలను బత్యాల అనుచరులు పట్టణంతో దగ్ధం చేశారు. తమ నాయకుడికి టికెట్ కేటాయించకుంటే పార్టీకి రాజీనామా చేస్తామని టిడిపి అధికార ప్రతినిధి అద్దేపల్లి ప్రతాప్‌రాజు హెచ్చరించారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై సిఇఒకు టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా రాష్ట్రంలో పోలీసులు మాత్రం అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, టిడిపి కార్యకర్తలపై దాడులు జరుగుతున్నా చోద్యం చూస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వర్ల రామయ్య మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనకూడదంటూ పోలీసులే టిడిపి కార్యకర్తలను బెదిరిస్తున్నారన్నారు. హైకోర్టు, ఎన్‌జిటి చెప్పినా వినకుండా యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని, వారికి పోలీసులూ సహకరిస్తున్నారని ఆరోపించారు. డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ ఎడిజి ఆంజనేయులుపై సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉపయోగిస్తున్న రెండు బుల్లెట్ ప్రూఫ్ బస్సులను ఎన్నికల కోడ్ సందర్భంగా ఆర్‌టిసి వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే శ్రీకాళహస్తిలో దొరికిన డంప్‌పైనా చర్యలు తీసుకోవాలని సిఇఒను కోరారు.

## తెలుగు ప్రజల భవిత కోసం కృషి

- టిడిపి అధినేత చంద్రబాబు
- ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగు ప్రజల ఖ్యాతి, అభ్యున్నతి లక్ష్యంగా తెలుగు ప్రజల సేవలో నాలుగు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీ నిమగ్నమై ఉందని, ఇక ముందూ తెలుగు ప్రజల బంగారు భవిష్యత్తు కోసం కృషి చేస్తుందని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. టిడిపి 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ట్విట్టర్ వేదికగా ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. బడుగు, బలహీన తరగతుల ప్రజలు రాజకీయాలను శాసించే స్థాయికి వెళ్లేలా అటు పార్టీలోనూ, ఇటు పాలనలోనూ ఎన్‌టిఆర్ పదవులు ఇచ్చారని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు కూడా పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

**టిడిపి కార్యాలయంలో వేడుకలు**

మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ అధికార ప్రతినిధి కంభంపాటి రామ్మోహన్‌రావు, నూజివీడు టిడిపి అభ్యర్థి కొలుసు పార్థసారథి, గురజాల మాల్యాద్రి తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. నారా భువనేశ్వరి, ఎమ్మెల్సీ అనురాధ తదితరులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ఉక్కు ఉద్యమంలో యువతది కీలకపాత్ర

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటంలో యువతది కీలకపాత్ర అని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1142వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎస్‌ఎంఎస్ విభాగానికి చెందిన కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటాన్ని మరింత ఉధృతం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరారు. స్టీల్ ఎస్‌ఎంఎస్ విభాగం నాయకులు యు మరిడయ్య మాట్లాడుతూ ప్లాంట్‌లో పనిచేస్తున్న యువ కార్మికులు ప్రయివేటీకరణ అంశంపై తీవ్ర ఆందోళనతో ఉన్నారన్నారు. రానున్న కాలంలో యువత మరింత పట్టుదలతో ఉద్యమాల్లో పాల్గొంటారని తెలిపారు.

## పాఠశాలలు తెరిచిన రోజే పంపిణీ

- 4.42 కోట్ల పుస్తకాల ముద్రణ ప్రారంభం
- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాబోయే విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్య పుస్తకాల ముద్రణ ప్రారంభమైందని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. పాఠశాలలు తెరిచిన రోజే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు 4.42 కోట్ల పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాల ముద్రణ శాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలలు పున:ప్రారంభమయ్యే జూన్ 12 నాటికి విద్యార్థులకు పుస్తకాలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తామని తెలిపారు. గణితం, సామాజిక, భౌతిక, జీవశాస్త్రం వంటి పాఠ్యాంశాలకు సంబంధించి రెండు భాషల్లో (ఒక వైపు తెలుగు, మరో వైపు ఇంగ్లీషు)లో పాఠ్య పుస్తకాలను ముద్రిస్తున్నామని, ఒకటి నుంచి పదోతరగతి వరకూ ఈ విధంగానే పుస్తకాలు ఉంటాయని పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి గానూ తొలిసారి ఫ్యూచర్ స్కిల్స్‌ను ఒక పాఠ్యాంశంగా ప్రవేశపెట్టి 8వ తరగతి విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తామని, 3 నుంచి 9వ తరగతి విద్యార్థులకు టోఫెల్ వర్క్‌బుక్‌లు అందజేస్తామని చెప్పారు. అలాగే ఈ విద్యా సంవత్సరం చివరి రోజున ఏప్రిల్ 23న వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన అన్ని తరగతుల పాఠ్య పుస్తకాలను పిడిఎఫ్ రూపంలో సిఎస్ఇ.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని, వాటిని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన వెల్లడించారు.

## టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రముఖ తెలుగు సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ యాదవ్ టిడిపిలో చేరారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిఖిల్‌కు పార్టీ కండువా కప్పారు. హైదరాబాద్‌లోని లోకేష్ నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. అదే విధంగా వైసిపి చిలకలూరిపేట మాజీ ఇన్‌చార్జ్ మల్లెల రాజేష్ నాయుడు కూడా లోకేష్ సమక్షంలో టిడిపి కండువా కప్పుకున్నారు. ఆయనతో పాటు చిలకలూరిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీను, కౌన్సిలర్లు, జెడ్‌పిటి, సర్పంచ్‌లు చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు.

## టిడిపి తుది జాబితా విడుదల

- గంటా, కళాకు దక్కిన చోటు
- గుంతకల్లు నుంచి మాజీ మంత్రి జయరాం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అభ్యర్థుల తుది జాబితా విడుదలైంది. మొత్తం పెండింగ్‌లో 8 అసెంబ్లీ, 4 పార్లమెంటు స్థానాలకు అభ్యర్థుల జాబితాను టిడిపి కార్యాలయం శుక్రవారం విడుదల చేసింది. ఈ జాబితాలో ఆ పార్టీ సీనియర్లు గంటా శ్రీనివాసరావు, కిమిడి కళా వెంకట్రావుకు చోటు దక్కింది. గంటాకు భీమిలి, కళాను చీపురుపల్లి స్థానాలకు అభ్యర్థులుగా ప్రకటించింది. అదే విధంగా ఇటీవల టిడిపిలో చేరిన మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు గుంతకల్ సీటు కేటాయించింది. కదిరి శాసనసభకు కొత్త అభ్యర్థిని ప్రకటించింది. రెండో జాబితాలో కందికుంట యశోదా దేవిని ప్రకటించగా, ఇప్పుడు కందికుంట ప్రసాద్‌కు అవకాశం కల్పించింది.

**శాసనసభ అభ్యర్థుల వివరాలు**

| క్రమసంఖ్య | నియోజకవర్గం | అభ్యర్థి పేరు |
|---|---|---|
| 1. | చీపురుపల్లి | కళా వెంకట్రావు |
| 2. | భీమిలి | గంటా శ్రీనివాసరావు |
| 3. | పాడేరు | కిల్లు వెంకటరమేష్ నాయుడు |
| 4 | దర్శి | గొట్టిపాటి లక్ష్మి |
| 5. | రాజంపేట | సుగవాసి సుబ్రహ్మణ్యం |
| 6. | ఆలూరు | వీరభద్ర గౌడ్ |
| 7. | అనంతపురం అర్బన్ | దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ |
| 8. | కదిరి | కందికుంట వెంకటప్రసాద్ |

**లోక్‌సభ అభ్యర్థులు**

| క్రమ సంఖ్య | నియోజకవర్గం | అభ్యర్థి పేరు |
|---|---|---|
| 1. | విజయనగరం | కలిశెట్టి అప్పలనాయుడు |
| 2. | ఒంగోలు | మాగుంట శ్రీనివాసులు రెడ్డి |
| 3. | అనంతపురం | అంబికా లక్ష్మీనారాయణ |
| 4. | కడప | చడిపిరాళ్ల భూపేష్ రెడ్డి |

## 41-ఎ నోటీసు ఇచ్చినా .. ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారించొచ్చు

ప్రజాశక్తి-అమరావతి

నిందితులు తమ ఎదుట హాజరుకావాలని పోలీసులు సిఆర్‌పిసి సెక్షన్ 41-ఎ కింద నోటీసు జారీ చేశాక నిందితులు ముందస్తు బెయిల్ పిటిషన్‌కు విచారణార్హత ఉందని హైకోర్టు తేల్చి చెప్పింది. పోలీసులు అరెస్టు చేస్తారని నిందితుడు భావించినప్పుడు ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేస్తే దానికి విచారణార్హత ఉంటుందని జస్టిస్ టి మల్లికార్జునరావు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. 41-ఎ నోటీసు ఇచ్చినా అరెస్టు ఆందోళన ఉన్నప్పుడు ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్లను కోర్టులు విచారిస్తాయని చెప్పారు. ఫేస్‌బుక్ ఫేక్ ఐడిలను తయారుచేసి వైఎస్ షర్మిల, వైఎస్ సునీత కీర్తిప్రతిష్ఠలను దెబ్బతిసేలా చేస్తున్నారంటూ ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడుగా ఉన్న విశాఖపట్నానికి చెందిన పినపల ఉదయభూషణ్ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనరుకు 41-ఎ నోటీసు ఇచ్చామని, ముందస్తు బెయిల్ పిటిషన్‌కు విచారణార్హత లేదని పోలీసులు చేసిన వాదనను హైకోర్టు తోసిపుచ్చి పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. పులివెందుల ఎస్‌హెచ్‌ఒ ఎదుట హాజరై బెయిల్ షరతులను అమలు చేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. మూడు నెలలపాటు ప్రతి 15 రోజులకోసారి కడప జిల్లా ఎస్‌పి ఎదుట హాజరుకావాలంది.

సుబ్బారావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న భాస్కరయ్య

## చేనేత కుటుంబాన్ని ఆదుకోవాలి

- బాధ్యులను కఠినంగా శిక్షించాలి : భాస్కరయ్య

**ప్రజాశక్తి-ఒంటిమిట్ట (వైఎస్ఆర్ జిల్లా)**

ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని వృత్తి సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య కోరారు. వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్ట మండలం మాధవరంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న పాల సుబ్బారావు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆత్మహత్య చేసుకున్న ఒక్కొక్కరికి రూ.25 లక్షలు చొప్పున వారి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా, 3.10 ఎకరాల భూమి, పెద్ద కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కలెక్టర్ అధ్యక్షతన న్యాయ విచారణ జరిపి, ఆత్మహత్యకు ముందు రాసిన లేఖను మరణ వాంగ్మూలంగా స్వీకరించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చేనేత వృత్తిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అగాధంలోకి తోసేశాయని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివ నారాయణ మాట్లాడుతూ.. చేనేత కార్మికులకు వర్క్ ఫ్రం షెడ్లు ఏర్పాటు చేయాలని, హ్యాండ్‌లూమ్ టెక్స్‌టైల్స్ పార్కులు అభివృద్ధిలోకి తీసుకురావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.నర్సయ్య, సహాయ కార్యదర్శి సురేష్‌బాబు, సాంబయ్య పరామర్శించిన వారిలో ఉన్నారు.

## 'కోడ్'కూసినా ఆగని సిఫార్సులు

- బిల్లుల చెల్లింపు కోసం లేఖలు

**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి**

ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినా... బిల్లుల చెల్లింపు కోసం సిఫార్సు లేఖలు మాత్రం ఆగడం లేదు. మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, ఇతర కీలక ప్రజాప్రతినిధుల నుంచి పెద్ద సంఖ్యలో ఆర్థికశాఖకు సిఫార్సు లేఖలు చేరుతున్నాయి. అధికారిక లెటర్ హెడ్లపైనే ఈ సిఫార్సు లేఖలు రాస్తుండడం గమనార్హం. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని అధికారులు అంటున్నారు. ఆర్థికశాఖ వద్ద వేల కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు లేకపోవడంతో వాటిని చెల్లించలేదు ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన తరువాత సిఫార్సు లేఖలు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధం. పెద్ద మొత్తంలో ఉన్న బిల్లులకు అనునిత్యం సిఫార్సు లేఖలు వస్తున్నాయని, మరికొన్ని బిల్లులకు నేరుగా ఫోన్‌లలోనే అడుగుతున్నారని ఆర్థికశాఖలో పనిచేస్తున్న ఒక అధికారి చెప్పారు. కొన్ని బిల్లులపై నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచే ఒత్తిళ్లు వస్తున్నాయని కూడా ఆయన పేర్కొన్నారు. దీంతో ఏం చేయాలో అర్థంకాని స్థితిలో అధికారులు పబిపోయారు.

**చిన్న కాంట్రాక్టర్ల కష్టాలెన్నో...**

పెద్ద కాంట్రాక్టర్లు, పలుకుబడి ఉన్నవారు సిఫార్సు లేఖలతో ఎంతో కొంత పనిజరిపించుకుంటుండగా, చిన్న కాంట్రాక్టర్ల పరిస్థితి ఘోరంగా ఉంది. వీరికి ఎవరూ సిఫార్సు లేఖలు ఇవ్వడం లేదు. దీంతో వీరు ప్రతిరోజు ఉదయాన్నే ఆర్థికశాఖ కార్యాలయానికి చేరకుని అధికారలు చుట్టూతిరుగుతున్నారు. ఇలా తిరుగుతున్న వారి సంఖ్య వందలలోనే ఉంది.

## ఖర్చు చేయని నిధులిచ్చేయండి

- శాఖలకు ఆర్థికశాఖ ఆదేశాలు
- నిధులే ఇవ్వకుండా ఎలా అంటున్న శాఖలు

**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి**

ఆర్థిక సంవత్సరం చివరికి వచ్చిన నేపథ్యంలో ఖర్చు కాని నిధులను ఖజానాకు జమ చేయాలని ఆర్థికశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అన్ని శాఖలకూ సర్క్యులర్లు అందాయి. బ్యాంకు ఖాతాల్లో ఉన్న ఖర్చు కాని నిధులను తక్షణమే ఖజానాకు బదలాయించాలని అధికారులు స్పష్టం చేశారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సేవింగ్స్ ఖాతాలు, కరెంటు ఖాతాల్లో ఉన్న వాటిని 31వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా వెనక్కు ఇవ్వాలని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. అయితే సింగిల్ నోడల్ ఏజెన్సీ ఖాతాలకు జమచేసిన కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు, శాఖలు సొంతంగా సమకూర్చుకున్న నిధులకు మినహాయింపు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, ఖజానా నుంచి సకాలంలో నిధులు రావడం లేదని, ఇవ్వాల్సిన నిధుల్లోనూ కోతలు పెడుతున్నారని పలు శాఖల అధికారులు వాపోతున్నారు. ఇలా ఇచ్చిన కొద్ది పాటి నిధులతోనే పని చేయాల్సి వస్తోందని వారంటున్నారు. తమ శాఖల్లో నిధులే లేని పరిస్థితుల్లో వెనక్కు ఇవ్వాలంటే ఎలా అన్న భావాన్ని కూడా కొంతమంది వ్యక్తం చేస్తున్నారు.

# జల'కళ' ఏదీ?

- బిల్లులు రాక పనులు ఆపేసిన కాంట్రాక్టర్లు
- 12శాతం లక్ష్యం దాటని బోర్లు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

బీడు భూములకు నీటి వసతిని కల్పించేందుకు ఉచితంగా బోరుబావులను తవ్వించి పేదరైతులను ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన వైఎస్సార్ జలకళ పథకం ఆచరణలో కలతప్పింది. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు రెండు లక్షల బోర్లను ఉచితంగా తవ్వి విద్యుత్ కనెక్షన్ ఇస్తామని, ఇందుకుగాను ప్రతి నియోజకవర్గానికి ఒక రిగ్గును ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెప్పింది. పేద రైతులను ఆదుకునేందుకే తమ ప్రభుత్వం వైఎస్సార్ జలకళను చేపట్టిందని 2020 సెప్టంబర్ 28న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారు. బోర్లు వేయడమే కాదు విద్యుత్ సౌకర్యాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకోసం రైతులనుండి దరఖాస్తులను తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 2,32,789 మంది రైతులు వైఎస్సార్ జలకళ పథకానికి దరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వం ఇప్పటిదాకా కేవలం 23,115 బోరుబావులను మాత్రమే తవ్వించింది. అంటే లక్ష్యం 12శాతం దాటని పరిస్థితి. మొదటి ఏడాదిలోనే వైఎస్సార్ జలకళ పథకంలో బోర్లుతవ్విన కాంట్రాక్టర్లకు బిల్లులు అరకొరగా చెల్లించడంతో రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టర్లు బోర్లు తవ్వితే బిల్లులు రావని జలకళ పథకానికి మంగళం పాడేశారు. మొదట్లో విద్యుత్ కనెక్షన్‌ను ఉచితంగా ఇస్తామన్న ప్రభుత్వం ఆ తర్వాత విద్యుత్ కనెక్షన్‌ను రైతులే భరించాలనే నిబంధన పెట్టడంతో రైతులు కూడా ముందుకు రాని పరిస్థితి నెలకొంది. జలకళ కింద బోర్లు వేసుకున్న రైతుల్లో కేవలం 3,500 మందికి మాత్రమే విద్యుత్ మోటార్లను అమర్చారు. ప్రారంభించిన ఏడాదిలో బిల్లులు వస్తాయని ఆశించిన కాంట్రాక్టర్లకు ఇప్పటిదాకా బిల్లులు చెల్లించని పరిస్థితి నెలకొంది. చాలా నియోజకవర్గాల్లో బిల్లులు తామే ఇప్పిస్తామని మంత్రులు, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని వేయించిన బోర్లకు ఇప్పటిదాకా బిల్లులను చెల్లించని పరిస్థితి నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టర్లకు రూ70 కోట్ల దాకా బిల్లులను చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు బిల్లుల కోసం అధికారులు, మంత్రులు చుట్టూ ప్రదిక్షణలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్భాటంగా చేపట్టిన వైఎస్సార్ జలకళ పథకం లక్ష్యం 12శాతం మించని పరిస్థితి నెలకొంది.

'జలకళ' ప్రచార చిత్రం (ఫైల్)

సభలో మాట్లాడుతున్న ఎఐఐఇఎ జాతీయ మాజీ కార్యదర్శి కె వేణుగోపాల్

## ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం సామాజిక బాధ్యత

- ఎఐఐఇఎ జాతీయ మాజీ కార్యదర్శి వేణుగోపాల్

**ప్రజాశక్తి-విజయనగరం టౌన్**

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని ఆలిండియా ఇన్సూరెన్సు ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) జాతీయ మాజీ కార్యదర్శి కె వేణుగోపాల్ అన్నారు. ప్రభుత్వ రంగం ఉంటేనే హక్కులు ఉంటాయని, అందుకోసం అన్ని వర్గాల ప్రజలనూ కలుపుకొని ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. విజయనగరంలోని రెవెన్యూ హోంలో శుక్రవారం ఎల్ఐసి బ్రాంచి అసిస్టెంట్, యూనియన్ నాయకుడు ఎం శ్రీనివాస్ ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వరంగ సంస్థల ప్రాధాన్యత అనే అంశంపై వేణుగోపాల్ మాట్లాడుతూ నేడు ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉన్న అతిపెద్ద ఇన్సూరెన్స్ సంస్థ ఎల్ఐసి అని, గుడ్ విల్ విషయంలో మొదటి స్థానంలో ఉందని చెప్పారు. ప్రధాని మోడీ గుజరాత్ సిఎంగా ఉన్న సమయంలో ప్రభుత్వ రంగ సంస్థలు చనిపోయిన సంస్థలు అని వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. ఇప్పుడు ఎల్ఐసి నుంచి డివిడెండ్ రూపంలో రూ.56 వేల కోట్లును మోడీ ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. ఎల్ఐసిని కార్పొరేట్ శక్తులకు అప్పగించాలని మోడీ ప్రభుత్వం చూస్తోందని, దానిని వ్యతిరేకించిన వారిపై కేంద్ర ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేసే విధానాలు అమలు చేస్తున్న బిజెపికి ఓటు వేశామంటే మన మనుగడను మనమే లేకుండా చేసుకున్నవారమవుతామని హెచ్చరించారు.

'మధ్యతరగతి ఉద్యోగులు- కర్తవ్యాలు' అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ మధ్యతరగతి ఉద్యోగులు మెరుగైన సమాజం కోసం ప్రజల్లో చైతన్యం, అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మనం ఉద్యోగాలు చేసి రాజ్యాంగం ద్వారా అనేక హక్కులు పొందుతున్నామని, నేడు బిజెపి పాలనలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నాయని వివరించారు. ప్రభుత్వ రంగ సంస్థలను, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు ఎల్ఐసి యూనియన్ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పులివెందుల తప్ప.. ఎక్కడినుండైనా పోటీ

- రఘురామకృష్ణంరాజు

**ప్రజాశక్తి - భీమవరం రూరల్ (పశ్చిమగోదావరి)**

బిజెపి, టిడిపి, జనసేన కూటమి తరుపున అభ్యర్థుల ఎంపికలో పొరపాట్లు జరిగాయని నరసాపురం ఎంపి కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. అనపర్తిలో ఆరు ఓట్లు వచ్చిన వ్యక్తికి టికెట్ ఇవ్వడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో శుక్రవారం తన నివాసం వద్ద రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ.. వైఎస్ఆర్ జిల్లా పులివెందుల తప్ప రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా తాను పోటీకి సిద్ధమని, తన గెలుపు కూడా ఖాయమని అన్నారు. 'మేమంతా సిద్ధం' అంటూ సిఎం జగన్ చేపట్టిన బస్సు యాత్ర రెండు చోట్లా ఫెయిలైందన్నారు. వివేకా హత్య కేసులో అవినాష్‌రెడ్డిని జగన్ కాపాడడానికి కారణం ఏమిటో అందరికీ తెలుసని, అవినాష్‌రెడ్డి పేరు తర్వాత అన్నయ్య పేరు బయటకు వస్తుందని ఆరోపించారు. వివేకా కుమార్తె సునీతకు అందరూ మద్దతు ప్రకటించాలని కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. తాను కచ్చితంగా పోటీలో ఉంటానని, రెండు రోజుల్లో తాను ఏ పార్టీ నుంచి పోటీ చేసేది ప్రకటిస్తానని చెప్పారు. నరసాపురం ఎంపి టికెట్ బిజెపి శ్రీనివాస్ వర్మకు కేటాయించినట్టే మిగతా చోట్ల కూడా సీనియర్ నాయకులకు టికెట్లు ఇస్తే బాగుండేదన్నారు.

## నేటి నుంచి పవన్ తొలి విడత ప్రచారం

**ప్రజాశక్తి - పిఠాపురం(కాకినాడ జిల్లా)**

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రచార షెడ్యూల్ ఖారారైంది. కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి ఆయన శనివారం (ఈ నెల 30) నుంచి ప్రచారం ప్రారంభించ నున్నారు. ఏప్రిల్ రెండు వరకూ పిఠాపురంలోనే ఉండ నున్నారు. 21 నియోజకవర్గాలకు సంబంధించిన నాయకులతో సమావేశాలు నిర్వహించనున్నారు. అనంతరం మూడు నుంచి 12వ తేదీ వరకూ పలు నియోజకవర్గాల్లో ఆయన పర్యటించనున్నారు. 3న తెనాలి, 4న నెల్లిమర్ల, 5న అనకాపల్లి, 6న యలమంచిలి, 7న పెందుర్తి, 8న కాకినాడ రూరల్, 9న పిఠాపురం, 10న రాజోలు, 11న పి.గన్నవరం, 12న రాజానగరం నియోజకవర్గాల్లో పవన్ పర్యటించి ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించే బహిరంగ సభల్లో పాల్గొంటారు.

## వేసవి దృష్ట్యా తగిన ఏర్పాట్లు చేయాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా

**ప్రజాశక్తి - ఏలూరు**

ఏలూరు సిఆర్ఆర్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిఇఒ

వేసవిని దృష్టిలో పెట్టుకొని పోలింగ్ కేంద్రాలతోపాటు ఎన్నికల సామగ్రి పంపిణీ తదితర చోట్ల తాగునీరు, టెంట్లు వంటివి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులకు ఆదేశించారు. ఏలూరులో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న సిఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు, చింతలపూడి, పోలవరం, నూజివీడు, కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ ఒకే ఆవరణలో ఉన్నందున ఆయా నియోజకవర్గాల ఓట్ల కౌంటింగ్‌కు వేర్వేరు సముదాయాల్లో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత లేఅవుట్‌ను పరిశీలించారు. ఏర్పాట్లపై కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వివరించారు. ఓట్ల లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన భద్రతకు సంబంధించి జిల్లా ఎస్‌పి డి మేరీ ప్రశాంతి, ఇతర పోలీసు అధికారులకు సిఇఒ సూచనలు చేశారు. తొలుత పోలింగ్ పూర్తయిన తరువాత వచ్చే ఇవిఎంలు, ఇతర స్టాట్యూటరీ సామగ్రిని స్వీకరించేందుకు రిసెప్షన్ కేంద్రాల ఏర్పాట్లపై సమీక్షించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. ఎన్నికల ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై వచ్చే ప్రతికూల వార్తలను నమోదు చేసే విధానం, వాటి పరిష్కార తీరును ఆరా తీశారు. సి-విజిల్ పర్యవేక్షక విభాగాన్ని, నిఘా బృందాల కదలికలను పరిశీలించే కంట్రోల్ రూమ్ నిర్వహణా తీరును సిఇఒ పరిశీలించారు. అనంతరం ఎన్నికల కమిషన్‌కు రోజువారీ నివేదికలు పంపే విభాగాన్ని సిఇఒ సందర్శించారు.

**మహీంద్రా హోమ్ ఫైనాన్స్**

**కార్పొరేట్ ఆఫీస్:** యూనిట్ నెం. 203, అమిత్ బిల్డింగ్, పిరమల్ అగస్త్య కార్పొరేట్ పార్క్, అగ్నిమాపక దళం స్టేషన్ ఎదురుగా, కమని జంక్షన్, L.B.S. మెయిన్ రోడ్, కుర్లా (పశ్చిమ) ముంబై - 400 070.

**రీజనల్ కార్యాలయం:** H.No 54-1/2D, 4వ అంతస్తు, శ్రీ సూర్య ప్రీమియర్, వెటర్నరీ కాలనీ, గుణదల, N.H-5వ రోడ్డు, విజయవాడ-520008.

**బహిరంగ ప్రకటన – ఆంధ్ర ప్రదేశ్ రీజియన్ లో బ్రాంచీల మూసివేత**

**మేము 29.06.2024 వ తేదీ నుండి ఈ క్రింద తెలిపిన బ్రాంచీలు మూసివేస్తున్నామని తెలియజేయుచున్నాము.**

| బ్రాంచ్ | బ్రాంచీల చిరునామాలు |
|---|---|
| పెద్దాపురం | 1వ అంతస్తు, డోర్ నెం.5-9-23, చైతన్య గోదావరి బ్యాంక్ పైన, పోలీస్ స్టేషన్ దగ్గర, పెద్దాపురం, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 533 437. |
| పొన్నూరు | 1వ అంతస్తు, డోర్ నం.14-1-16/2, GBC రోడ్, రవి కార్డియాక్ హాస్పిటల్ ఎదురుగా, పొన్నూరు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522 124. |
| పోరుమామిళ్ల | 1వ అంతస్తు, యూనిట్ నెం.12/378-3, గాంధీ సర్కిల్, మెయిన్ రోడ్, పోరుమామిళ్ల, YSR కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్-516 193. |
| తాళ్లరేవు | డోర్ నెం.7-232, 1వ అంతస్తు సీతారామపురం కాలనీ, తాళ్లరేవు, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-533 463. |

పైన సూచించిన తేదీ తర్వాత పైన తెలిపిన బ్రాంచీల కార్యకలాపములు నిలిపి వేయటమైనది. ఖాతాదారులు అందరు దయచేసి గమనించగలరు.

సం /- అధీకృత అధికారి
M/S. మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

**NOTICE** AgroStar®

In order to make the Indian Farmers internationally competitive, Ulink Agritech Pvt. Ltd., brings to you the following 100% Water Soluble Mixture Fertilisers as per order dated 24.10.2015, issued by ministry of Agriculture & Farmers Welfare, Govt. of India, New Delhi.

| Name of Fertilizer | Total N (% | Total P2O5 (%) | Total K2O (%) | Total S (%) | Total Zn (%) | Total MgO (%) | Total FE (%) | Total TE (%) |
|---|---|---|---|---|---|---|---|---|
| NPK 19:19:19 | 19.0 | 19.0 | 19.0 | - | - | - | - | - |
| NPK 13:40:13 | 13.0 | 40.0 | 13.0 | - | - | - | - | - |
| NPK 0:12:45 | - | 12.0 | 45.0 | - | - | - | - | - |
| NPK 15:30:05+1ZN | 15.0 | 30.0 | 5.0 | - | 1.0 | - | - | - |
| NPK 10:50:00 +3MgO+1.5FE | 10.0 | 50.0 | - | - | - | 3.0 | 1.5 | - |
| NPK 00:30:35 +2.8FE+TE | - | 30.0 | 35.0 | - | - | - | 2.8 | - |
| NPK 10:20:20 +1.5MgO+TE | 10.0 | 20.0 | 20.0 | - | - | 1.5 | - | - |
| NPK 05:30:30 +TE | 05.0 | 30.0 | 30.0 | - | - | - | - | - |
| NPK 00:60:20 | - | 60.0 | 20.0 | - | - | - | - | - |

**Salient Features:**
1. 100% Water Soluble.
2. Improve Quality and yield of the produce.
3. Suitable to use through drip irrigation and foliar Application.

**Packing:** Available in 1 kg, 5 kg, 10 kg and 25 kg packing.
**Supply and sales of above Agrostar WSF grades will be done after 30-35 days.**

**Imported & Marketed by:**
**UlinkAgritech Private Limited.**
Reg. Office Nos. 001 and 002, Ground Floor Wing "A" and Nos. 003 and 004 Ground Floor Wing "B", Nyati Tech Park, Wadgaon Sheri, Pune – 411014, Maharashtra, India

# ఆదివారమూ పని చేయనున్న బ్యాంక్‌లు

- బీమా సంస్థలు తెరిచి ఉంటాయి
- నేడు పనిదినమే..
- రెగ్యులేటరీ సంస్థల ఉత్తర్వులు

**ముంబయి :** ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో బ్యాంకులు, బీమా సంస్థలు, పన్ను సంబంధిత కార్యాలయాల విభాగాలు పని చేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. 2023-24 ముగింపు నేపథ్యంలో శనివారం, ఆదివారం కూడా దేశ వ్యాప్తంగా అన్ని బ్యాంకులు, బీమా సంస్థల కార్యాలయాలు, శాఖలు తెరుచుకుని ఉండేలా రెగ్యులేటరీ సంస్థలు ఉత్తర్వులు జారీ చేశాయి. ప్రభుత్వ లావాదేవీలకు, ఇతరత్రా చెల్లింపులకు, ట్యాక్స్ చెల్లింపులకు ఆటంకం లేకుండా ఆర్‌బిఐ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ, ప్రయివేటు రంగంలోని 33 బ్యాంక్‌లు పని చేసేలా ఆర్‌బిఐ ఉత్తర్వులు జారీ చేసింది. నెఫ్ట్, ఆర్‌టిజిఎస్‌తో పాటు చెక్ క్లియరెన్సులు తదితర సేవలు యథాతథంగా కొనసాగుతాయి. వీటితో పాటు స్పెషల్ డిపాజిట్ స్కీమ్, పిపిఎఫ్, కిసాన్ వికాస్ పత్ర, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాల్లో డిపాజిట్లను స్వీకరిస్తారు. అయితే బ్యాంక్‌ల్లో సాధారణ సేవలు అందుబాటులో ఉంటాయా..? లేదా అనేది స్పష్టం చేయలేదు. 2023-24లోనే ప్రభుత్వ లావాదేవీలు జరిగినట్లుగా వివరాలు లెక్కలోకి రావాలన్నదే దీని వెనక ప్రధాన ఉద్దేశ్యమని ఆర్‌బిఐ పేర్కొంది. ఆర్‌బిఐ తరహాలోనే ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ సంస్థ ఐఆర్‌డిఎఐ సైతం బీమా సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. పాలసీదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్చి 30, 31న కార్యాలయాలు తెరిచి ఉంచాలని ఆదేశించింది. ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించింది. మరోవైపు పన్ను సంబంధిత కార్యకలాపాలను పూర్తి చేసేందుకు మార్చి 30, 31న తమ శాఖలన్నీ పని చేస్తాయని ఆదాయ పన్ను విభాగం ఇటీవలే స్పష్టం చేసింది. కాగా.. ఏప్రిల్ 1న మాత్రం రూ.2వేల నోట్ల మార్పిడిని నిలిపివేస్తున్నట్లు ఆర్‌బిఐ పేర్కొంది.

## కరువునూ ఆయుధంగా మార్చుకుంటున్న ఇజ్రాయిల్

- ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల హై కమిషనర్ హెచ్చరిక

**గాజా :** గాజాలో తలెత్తుతున్న కరువు కాటకాలన్నీ కృత్రిమమైనవేనని, దీన్నొక ఆయుధంగా మార్చుకోవాలని ఇజ్రాయిల్ ప్రయత్నిస్తోందని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల హై కమిషనర్ హెచ్చరించారు. ఇజ్రాయిల్ ఉద్దేశ్యం రుజువైతే ఇది యుద్ధ నేరం కిందకు వస్తుందని హై కమిషనర్ వోల్కర్ టర్క్ అన్నారు. గాజాలో అవసరమైన వారికి ఆహార, సహాయ సరఫరాలు అందకుండా చేసే ప్రయత్నాలతో సహా ఈ యుద్ధంలో ఇరు వర్గాలు తమ చర్యలకు బాధ్యతల నుండి తప్పించుకోలేవని అన్నారు. మానవతా సాయం అందచేయడానికి అనేక అవాంతరాలు, అవరోధాలు, ఆంక్షలు వుంటున్నాయని, వాటన్నింటికీ ఇజ్రాయిల్‌నే నిందించాల్సి వుందని తన సహచరులు చెబుతున్నారని అన్నారు. కాగా టర్క్ చేసిన వ్యాఖ్యలను, విమర్శలను ఇజ్రాయిల్ ఆర్థిక మంత్రి నీర్ బర్కత్ తీవ్రంగా విమర్శించారు. ఇవన్నీ పూర్తిగా అర్ధరహితమైనవని అన్నారు. పూర్తి బాధ్యతారాహిత్యమైనవని అన్నారు. గాజాలోని పాలస్తీనియన్లకు సాయం అందడం లేదంటే దాన్ని పంపిణీ చేయంలో విఫలమైన క్యరాజ్య సమితిని అనాలి కానీ ఇజ్రాయిల్‌ను కాదని అన్నారు. కానీ పాలస్తీనాకు మానవతా సాయాన్ని అందించడంలో కీలక మైన పాత్ర పోషించే ఐక్యరాజ్య సమితి శరణార్థుల సహాయ సంస్థ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ) టర్క్ వ్యాఖ్యలకు మద్దతిచ్చింది. గాజాలోఓ క్షామ పరిస్థితులు నెలకొనే దిశగా సమయం పరిగెడుతోందని అన్నారు. ఆహార బృందాలను అడ్డగిస్తుండడంతో ఉత్తర గాజాలో దుర్భిక్షం పొంచి వుందన్నారు. పైగా హమాస్ జరిపిన దాడిలో ఐక్యరాజ్య సమితి సిబ్బంది చాలా మంది పాల్గొన్నారంటూ ఇజ్రాయిల్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో సంస్థకు వచ్చే నిధులను అనేక దేశాలు నిలిపివేశాయని పేర్కొంది.

## మద్యం, నగదు పంపిణీతో ఓట్లు వస్తాయనుకోవడం అవివేకం

- వివి లక్ష్మీనారాయణ

**ప్రజాశక్తి - సీతమ్మధార (విశాఖపట్నం)**

రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు మద్యం, నగదు వంటివి పంపిణీ చేస్తే ఓట్లు వస్తాయనుకోవడం అవివేకమే అవుతుందని జై భారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపకులు, ఆ పార్టీ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వివి లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం జివిఎంసి 25వ వార్డు సీతంపేట దుర్గా గణపతి ఆలయం నుంచి ఆయన వాహన ప్రచార ర్యాలీ ప్రారంభమై ఊర్వశి జంక్షన్ వరకూ సాగింది. ఈ సందర్భంగా పలుచోట్ల ఆయన మాట్లాడుతూ తాను గెలిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. కొండవాలు ప్రాంతాల ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విశాఖ డ్రగ్స్ కేంద్రంగా మారడం బాధాకరమన్నారు. తాము త్వరలో మంచి మ్యానిఫెస్టోతో ప్రజల వద్దకు వస్తామని తెలియజేశారు. టార్చిలైట్ గుర్తుపై ప్రజలు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

## బస్సు లోయలో పడి 45 మంది మృతి

**కేప్‌టౌన్ :** దక్షిణాఫ్రికాలో ఘోర ప్రమాదం జరిగింది. వంతెనపైనుండి బస్సు లోయలోకి పడిపోవడంతో 45 మంది మరణించారు. బస్సులో ఉన్నవారంతో మృతి చెందగా, ఒక చిన్నారి తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. స్థానిక అధికారుల సమాచారం మేరకు ... బోట్స్‌వానా నుంచి మోరియాకు 46 మందితో బస్సు బయలుదేరింది. ఈ క్రమంలోనే ఉత్తర ప్రావిన్స్ లింపోపోలోని మమట్లకల సమీపంలో కొండపై నిర్మించిన వంతెన మలుపులో బస్సు తిరుగుతుండగా అదుపుతప్పింది. బస్సును డ్రైవర్ కంట్రోల్ చేయలేకపోయాడు. బస్సు వంతెనపై నుంచి 165 అడుగుల లోతు లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తోసహా 45 మంది చనిపోయారని అధికారులు వెల్లడించారు. 8 ఏళ్ల వయసున్న ఒక్క చిన్నారి మాత్రం తీవ్ర గాయాలతో బయటపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు, అధికారులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలను చేపట్టారు. లోయలో పడిన వెంటనే బస్సులో మంటలు చెలరేగడంతో కొన్ని మృతదేహాలు గుర్తించలేనంతగా కాలిపోయాయని అధికారులు తెలిపారు.

**లాంఛనప్రాయ స్వాధీనత నోటీసు**

ICICI Home Finance

**నమోదిత కార్యాలయం:** ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (తూర్పు), ముంబై-400051

**కార్పొరేట్ కార్యాలయం:** ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్, జెబి నగర్, అంధేరి కుర్లా రోడ్డు, అంధేరి తూర్పు, ముంబై-400059

**శాఖా కార్యాలయం:** 2వ అంతస్తు, 40-1-129/1, ఆర్‌సిసి భవనం, మహాత్మాగాంధీ రోడ్డు, చంద్రమౌళీపురం, విజయవాడ-520010.

ఏదైతే

దిగువ సంతకందారు ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.

రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థి దిగువ సంతకందారుడు స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరిండమేమనగా ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

| క్ర. సం | రుణగ్రహీత/సహ రుణగ్రహీత పేరు/ లోను ఖాతా సంఖ్య | ఆస్తి వివరణ/స్వాధీనత తేది | డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.) | శాఖ పేరు |
|---|---|---|---|---|
| 1. | బొట్ల పద్మావతి (రుణగ్రహీత), బొట్ల హారిక (సహ రుణగ్రహీత)/ LHVJW00001465056 | 77 ఆర్ఎస్.నం.63/1, ఆర్ఎస్.నం.63/2, డో.నం.6-122, అశోక్‌నగర్, రాయనపాడు విజయవాడ 63/1 విజయవాడ ఆంధ్రప్రదేశ్-521137 (రిఫ్.ఎల్ఎఎన్.నం. LHVJW00001465056) హద్దులు : ఉత్తరం : పంచాయతీ రోడ్డు, దక్షిణం : ఎమ్.వెంకటేశ్వర ఆస్తి, తూర్పు : 30 అ.లు. వెడల్పు పాసేజ్, పడమర : సుబ్బారావు ఆస్తి /స్వాధీనత తేది 28.03.2024 | 16-01-2024 Rs. 25,47,468/- | విజయవాడ-బి |

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.

**తేది : 30 మార్చి, 2024**
**ప్రదేశం : విజయవాడ**

అధీకృత అధికారి
ఐసిఐసిఐ హోం ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

Reliance Commercial Finance Limited
(Subsidiary of Authum Investment & Infrastructure Limited)

**కార్పొరేట్ & రిజిస్టర్డు ఆఫీసు:** రూబీ టవర్, 11వ అంతస్తు, నార్త్ వెస్ట్ వింగ్, ప్లాట్ నం.29, జె.కె. సావంత్ మార్గ్, దాదర్, ముంబయి-400028.

**బ్రాంచి ఆఫీసు:** రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, 3వ అంతస్తు, ధృవ్ ఆర్కెడ్, నం. 6-3-248/బి/1, నవీన్ నగర్, రోడ్ నం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.

**సవరణ**

ఏదైతే, గౌరవ భారత దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశం తేది **మార్చి 3, 2023** నాటి ఆదేశం, స్ట్రెస్డ్ అసెట్స్ రిసొల్యూషన్ కొరకు ప్రుడెన్షియల్ ఫ్రేమ్‌వర్క్ పై ఆర్‌బిఐ సర్క్యులర్ నం. ఆర్‌బిఐ/2018-19/203, డిబిఆర్ నం. బిపి.బిసి. 45/21.04. 048/2018-19 తేది: 7 జూన్, 2019 యొక్క నియమాలలో రిలయన్స్ హెూమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్ఎల్) యొక్క రీసొల్యూషన్ ప్లాన్ దాని లెండర్స్ ద్వారా ఆమోదించిన రీసొల్యూషన్ ప్లాన్ మరియు **మార్చి 25, 2023న** వాటాదారులచే చేసిన ప్రత్యేక తీర్మాణం అనుసరించి, ఆర్‌సిఎఫ్ఎల్ఎల్ దాని వ్యాపారంను స్లంప్ సేల్ విధానంలో సంబంధిత ప్రాతిపదికన ముందుటకు ట్రాన్స్‌ఫర్‌కు రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌సిఎఫ్ఎల్) ఒప్పందంలో ప్రవేశిస్తుంది. మరియు ఏదైతే రుణగ్రహీత యొక్క రుణ ఖాతాలుకు సంబంధించిన అన్ని హక్కులు మరియు బకాయి చెల్లింపులు కూడా ఆర్‌సిఎఫ్ఎల్‌కు బదీలి అవుతాయి.

రుణగ్రహీతలు **"1) సాంబశివ రావు వుల్చి, 2) వి. వనజ"** పేరున **తేది: 15.03.2024** నాటి ఈ దినపత్రికలో ప్రచురించిన **"సేల్ కం ఇ-వేలం నోటీసు"**గా మా ఇటీవలి ప్రకటనను పరిశీలించండి, దయచేసి గమనించండి: **"పరిశీలన తేది:** 17 ఏప్రిల్ 2024, **ధరావత్తుకు చివరి తేది:** 18 ఏప్రిల్ 2024, **ఇ-వేలం తేది/ సమయం:** 19 ఏప్రిల్ 2024 **మరియు ఇటీవలి ప్రచురించినట్లుగా కాకుండా, "పరిశీలన తేది:** 19 ఏప్రిల్ 2024, **ధరావత్తుకు చివరి తేది:** 18 ఏప్రిల్ 2024, **ఇ-వేలం తేది/ సమయం:** 17 ఏప్రిల్ 2024"అని తప్పుగా పేర్కొనబడినది.

నోటీసులోని మిగతా అంశాలలో మార్పులేదు.

ప్రదేశం: హైదరాబాద్
తేది: **30.03.2024**

సం/-
(అధీకృత అధికారి),
రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్

సంపాదకీయం

# డబ్బుల్లేవా..!

కేంద్ర ఆర్థిక శాఖామాత్యులు శ్రీమతి నిర్మలా సీతారామన్ తన వద్ద డబ్బుల్లేవు కనుక పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయడంలేదని మీడియాతో చెప్పడం దేశ ప్రజలను ఆశ్చర్య చకితుల్ని చేసింది. అలాగే కొన్ని నగ్నసత్యాలను వెల్లడించడంతోపాటు పలు సందేహాలకు కారణమైంది. నిర్మలమ్మ మాటల ప్రకారం బిజెపి తరపున పోటీ చేయాలంటే అభ్యర్థికి చాలా డబ్బుండాలన్నది ప్రాథమిక నిర్ధారణ. ఎన్నికల్లో పోటీకి భారీగా ఖర్చు చేయాల్సివుంటుందని సాక్షాత్తూ కేంద్ర ఆర్థిక మంత్రి స్పష్టం చేసినట్టయింది. అదే కనీస అర్హతగా కూడా భావించవచ్చు. ఇంకో విధంగా చెప్పాలంటే బిజెపి అభ్యర్థులు ఎన్నికల్లో డబ్బు ధారాళంగా ఖర్చు చేస్తారు. అలాగే డబ్బు ఖర్చు చేయలేనివారిని బిజెపి తన అభ్యర్థులుగా పోటీకి నిలపదన్నమాట. అంతేగాక వివిధ మీడియాల్లో మోత మోగిస్తున్న మోడీ గ్యారంటీలతో బిజెపి అభ్యర్థులు గెలవరనీ డబ్బు ఖర్చు చేసి గెలుస్తారనీ నిర్మలమ్మ చెప్పకనే చెప్పారు. ఆ విధంగా ఆ పార్టీ అభ్యర్థులకు ముందస్తు హెచ్చరికలు చేసినట్టే! ఇటువంటి ఎన్నో వాస్తవాలను ఆర్థిక మంత్రివర్యులు అన్యాపదేశంగానైనా వెల్లడించడం బాగానేవుంది.

ఇంతపెద్ద దేశానికి ఆర్థిక మంత్రిగా ఉన్న మీకే డబ్బు లేకపోతే ఇంకెవరివద్ద ఉంటుందన్న పాత్రికేయుల ప్రశ్నకు అది దేశం డబ్బు, నాది కాదు కదా అని అమాత్యుల సమాధానం. అవును అది దేశం డబ్బే! మరి ఇడి, సిబిఐ, ఐటి దాడులు చేయించిన అధికార బిజెపి అక్రమంగా కూడబెట్టిన రూ.8,500 కోట్ల విలువైన ఎలక్టొరల్ బాండ్ల సంగతి ఏమిటి? అవి కమలం పార్టీ ఖాతాలో పడినవే కదా! ఆ డబ్బును ఎన్నికలకు కాక ఇంకేదైనా ప్రయోజనానికి ఉపయోగిస్తారా? ఎన్‌డిఎ భాగస్వామ్య పార్టీలు పోను బిజెపి సుమారు 450 స్థానాలు పోటీ చేస్తుందనుకుంటే ఒక్కో నియోజకవర్గంలో బాండ్ల సొమ్ము మాత్రమే చూసినా దాదాపు రూ.20 కోట్ల చొప్పున ఖర్చు చేయవచ్చు. అంటే పార్టీ నిధి నుండి అభ్యర్థులకు ఇవ్వబోరనా లేక కమలనాథులు ఎన్నికల్లో ఇంకా పెద్ద మొత్తంలోనే ఖర్చు చేస్తారనా! అంతేగాక ఆంధ్రప్రదేశ్ లేదా తమిళనాడులో పోటీ చేస్తే తన కన్నవారిల్లు అత్తవారిల్లు వంటి స్థానికతకు సంబంధించిన సమస్యలూ చర్చనీయాంశాలవుతాయని ఆమె వాపోయారట. గతంలో ఆంధ్రప్రదేశ్ నుండి తెలుగు వారి కోడలి పేరిట రాజ్యసభకు ఎన్నికైన సంగతి ఆమె మర్చిపోయినా ఆంధ్రులు గుర్తు పెట్టుకుంటారు. అయితే, మతం, భాష, ప్రాంతం తదితర ప్రాతిపదికన జనాన్ని రెచ్చగొడుతూ సంఘపరివార్ సాగిస్తున్న విద్వేష ప్రచారం, బిజెపి గొప్పగా చెప్పుకునే సోషల్ ఇంజనీరింగ్ ప్రభావాలు ఈ విధంగా వారికి కూడా ప్రతికూల ఫలితాలిస్తుంటాయని అర్థం చేసుకోవడం అవసరం.

ఈ దేశాన్ని సుమారు పదిహేనేళ్లపాటు పాలించిన పార్టీలో ముఖ్యస్థానాల్లో పని చేసి, పదేళ్లపాటు కేంద్ర క్యాబినెట్ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన వ్యక్తి పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయడానికే డబ్బుల్లేవంటే ఇక సామాన్యుల మాటేమిటి? వారు ఎన్నికల దరిదాపుల్లోకి రాగలరా? ఇలా అయితే భారత్‌లో ప్రజాస్వామ్యం మనగలిగేదెలా? అందుకనే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఖర్చు చేసేందుకు నిధుల్ని ప్రభుత్వమే భరించేలా, అందుకు గడచిన ఎన్నికల్లో ఆ పార్టీ పొందిన ఓట్ల శాతాన్నిబట్టి చెల్లించడంలాంటి నిబంధనలతో ఎన్నికల సంస్కరణలు తేవాలని వామపక్షాలు, అభ్యుదయవాదులూ కోరుతున్నారు. అదే విధంగా పార్టీకి వచ్చే ఓట్ల దామాషానుబట్టి ప్రాధాన్యతా జాబితాలోని అభ్యర్థులు చట్టసభలకు ఎన్నికయ్యేలా ఆ సంస్కరణలుండాలనీ చాలా కాలంగా డిమాండ్లున్నాయి. అసలు ఎన్నికల్లో డబ్బు ప్రమేయమే లేనివిధంగా మార్పులు తీసుకొస్తేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. నేర చరితులను చట్టసభలకు ఎన్నిక కాకుండా చూడాలి. ఎన్నికల్లో డబ్బు ప్రధాన పాత్ర వహిస్తుందన్న ఆర్థిక మంత్రి మాటల సారాంశాన్ని తీసుకుంటే ఎన్నికల సంస్కరణల ఆవశ్యకత బోధపడుతుంది. అయితే మోడీ ప్రభుత్వం ఈపాటి ప్రజాస్వామ్యం కూడా మిగలకుండా జమిలి ఎన్నికల పేరిట ఏక పార్టీ ఏక వ్యక్తి నియంతృత్వ పాలన దిశగా చర్యలు చేపడుతోంది. ఆ కుట్రలను వమ్ము చేయాలి. అందుకు ఈ కార్పొరేట్-మతతత్వ కూటమి పాలనను అంతం చేయడమే ఏకైక మార్గం.

మహనీయుల మాట

**ప్రజలంతా రాజకీయంగా చైతన్యవంతులై వుండాలనీ.... ఐక్యంగా, దోపిడీ వర్గాల ప్రభావం నుంచి దూరంగా, వెనుకబాటుతనానికి దూరంగా వుండాలని కొందరు భావిస్తారు. కాని, ప్రజలంతా అలా వుంటే ఇంక విప్లవం సాధించడంలో కష్టమేముంటుంది?**

**- లీ షావ్‌చీ,**
**చైనీస్ విప్లవకారుడు, రాజకీయవేత్త.**

# ప్రతిపక్షాలను దెబ్బ తీసేందుకే 'ఆ' దాడులు

విశ్లేషణ

వి. రాంభూపాల్

దేశంలోని ప్రతిపక్ష పార్టీల నేతలు 'తమకు లొంగి గులాంగిరి చేయాలి, లేదంటే తీహార్ జైల్లో ఉండాలి' అనేది బిజెపి రాచరికపు మనస్తత్వం. అందుకోసం గత పదేళ్ళ మోడీ పాలనలో ఇ.డి, ఐ.టి, సిబిఐ లాంటి రాజ్యాంగబద్ధ సంస్థలను విచ్చలవిడిగా దుర్వినియోగం చేసేశారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత కూడా ప్రతిపక్షాలపై, ఆ పార్టీల నేతలపై ఈ వేధింపులు ఆగడంలేదు. గత వారం పది రోజుల్లో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను, బిఆర్ఎస్ నేత కవితను జైలో పెట్టడం, కేరళ ముఖ్యమంత్రి కుమార్తెపై ఇ.డి రాత్రికి రాత్రి కేసు పెట్టడం, పలు రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీల నేతలు, వారి బంధువుల ఇళ్లపై దాడులు కొనసాగించడం, కాంగ్రెస్ పార్టీ బ్యాంకు అకౌంట్లను స్తంభింపచేయడం వెనుక బిజెపి అధికార దాహం వుంది. అందుకు రాజ్యాంగబద్ధ సంస్థలను ఆయుధాలుగా వాడుకుంటున్నది. అవినీతి, అక్రమాలను అరికట్టి దేశానికి బాధ్యత వహించాల్సిన ఇ.డి, ఐ.టి, సిబిఐ సంస్థలు యజమాని ఆదేశాలను అమలు చేసే ప్రైవేట్ సంస్థలుగా మారిపోతూ, వాటి విశ్వసనీయతను కోల్పోతున్నాయి.

ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ (పిఎంఎల్ఎ) చట్టాన్ని 2005, 2009, 2012లో అప్పటి కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఎ ప్రభుత్వం సవరించింది. 1991 నుండి దేశంలో ప్రారంభమైన సరళీకరణ విధానాలు కొత్త తరహా అవినీతి, అక్రమాలకు దారితీశాయని వాటిని నిరోధించడానికి అవసరమైన చట్టబద్ధ ఏర్పాట్ల కోసం ఈ సవరణలు చేశారు. 2019కి ముందు రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వ దార్యాప్తు సంస్థలు ఎఫ్ఐఆర్ లేదా చార్జిషీట్లలో పిఎంఎల్ఏ సెక్షన్లు పెడితేనే ఇ.డి రంగంలోకి వచ్చి విచారణ జరిపేది. మోడీ ప్రభుత్వం 2019లో ఈ చట్టానికి చేసిన సవరణ వల్ల...ఇ.డి కి ఎవరు ఫిర్యాదు చేయకపోయినా, ఏ ఆధారాలు తనకు అందుబాటులో లేకపోయినా...నేరుగా ఇళ్ల మీద, ఆఫీసుల మీద దాడి చేసే అధికారాలను, ఎఫ్ఐఆర్ నమోదు చేసి, అరెస్టులు చేసే అధికారాలను కట్టబెట్టింది. ఈ సవరణ వల్ల బిజెపి రెండు రకాలుగా లబ్ధి పొందింది. ఇ.డి ద్వారా దాడులు చేయించి ప్రతిపక్ష రాజకీయ పార్టీల నేతలను లొంగదీసుకోవడం లేదా ప్రజల్లో అప్రతిష్టపాలు చేసి జైల్లో పెట్టడం ద్వారా తన ప్రత్యర్థులను బలహీనులను చేయడం. కార్పొరేట్ కంపెనీల ద్వారా వేల కోట్ల రూపాయలను విరాళాలుగా స్వీకరించడం. ఇందు కోసం 2019 లోనే ఎన్నికల బాండ్ల విధానాన్ని తెచ్చింది.

2004-2014 మధ్య కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఎ పాలన కాలంలో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ చట్టం (పిఎంఎల్ఎ) కింద 112 కేసులు నమోదు కాగా, బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ పాలనలో పిఎంఎల్ఎ చట్టం కింద 5,906 కేసులు, ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా) కింద 12,233 కేసులు నమోదయ్యాయి. గడచిన ఒక్క సంవత్సరంలోనే 1,180 కేసులను ఇ.డి పెట్టింది. ఇది ఇ.డి చరిత్రలో ఆల్‌టైమ్ రికార్డు. ఇ.డి కేసులు ఇంతగా పెరగడానికి రెండు కారణాలు వుండాలి. ఒకటి-మోడీ పాలనా కాలంలో అవినీతి, అక్రమాలు భారీగా పెరగడం వల్ల ఈ కేసుల సంఖ్య పెరిగి వుండాలి. రెండు-రాజకీయ ఆధిపత్యం కోసం ఉద్దేశపూర్వకంగా ప్రతిపక్ష పార్టీల నేతలపై తప్పుడు కేసులు పెట్టి వుండాలి. తమ పాలనలో అవినీతిని అంతం చేశామంటున్న మోడీ ఆయన వందిమాగదులు తమ పాలనా కాలంలో అవినీతి పెరిగిందనడాన్ని అంగీకరించరు. అలాంటప్పుడు రాజకీయ కక్ష సాధింపు కోసమే ఇ.డి, ఐ.టి, సిబిఐ సోదాలు, దాడులు జరిగాయనేది నిజం. మోడీ పాలనలో ఇప్పటి వరకు నమోదైన 5,906 కేసుల్లో నేరం రుజువైంది కేవలం 25 కేసుల్లోనే. అంటే నేర నిర్ధారణ జరిగిన కేసులు 0.42 శాతం మాత్రమే! ఇ.డి ఇన్ని వేల కేసులు ఎందుకు పెట్టింది? ఆర్థిక నేరాలను అరికట్టడానికా? బిజెపి రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చడానికా? 2014 నుండి 2022 మధ్య 115 మంది రాజకీయ నేతలపై కేసులు నమోదు కాగా, అందులో 95 శాతం మంది ప్రతిపక్ష పార్టీల నేతలేనని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక ఇటీవల వివరాలు ప్రకటించింది. 2023లో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపి గెలవడం వెనుక ఆయా రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీల నేతలపై ఇ.డి చేసిన దాడుల ప్రభావం వుందనేది జగద్విదితం.

**విచిత్రమేమంటే బిజెపి యేతర పార్టీల్లో వున్నప్పుడు ఇ.డి, సిబిఐ దాడులు ఎదుర్కొన్న రాజకీయ నాయకులు బిజెపిలో చేరిన వెంటనే విచారణలు ఆగిపోవడమే కాక, పదవులు దక్కడం మోడీ మ్యాజిక్. భావన గవాలి, ప్రతాప్ సర్నాయక్, హసన్ ముష్రిఫ్, అజిత్ పవార్, యామినీ జాదవ్, ఛగన్ భుజబల్, అశోక్ చౌహాన్...ఇలా ఎంతోమంది ఇ.డి నేరారోపణలు ఎదుర్కొని బిజెపిలో చేరిపోయి ఉన్నత స్థానాల్లో అధికారాన్ని చెలాయిస్తున్నారు.**

త్వరలో జరగబోతున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మరల ఇ.డి దాడులు పెరుగుతున్నాయి. ఈ సంవత్సరం జనవరి నెలలో 19 చోట్ల దాడులు జరిగాయి. జనవరి 29న జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఇంటిపై సోదాలు చేసి ఆయనను అరెస్టు చేసి జైల్లో పెట్టారు. 2021 ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో గత వారం ఆప్ అధినేత కేజ్రీవాల్, బిఆర్ఎస్ నేత కె. కవితలను జైల్లో పెట్టారు. సిబిఐ గతంలో బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌పై నమోదు చేసిన పాత కేసులో ఆయనను, ఆయన భార్య, మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవి, ఆయన కుమారుడు తేజస్వి యాదవ్, ఇద్దరు కుమార్తెలపై ఇ.డి విచారణ ప్రారంభించింది. ఢిల్లీ మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ప్రస్తుతం జైల్లో ఉన్నారు. ఈ నెలలో మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, కేరళ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో ఇ.డి జరిపిన దాడులు ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకుని జరిగాయి. 'ఇండియా' వేదిక ఏర్పాటులో కీలకంగా వున్న బీహార్ ముఖ్యమంత్రి రాత్రికి రాత్రి ఫిరాయించి బిజెపి పంచన చేరడం వెనుక ఇ.డి భయం వుందనే వార్తలు వచ్చాయి.

విచిత్రమేమంటే బిజెపి యేతర పార్టీల్లో వున్నప్పుడు ఇ.డి, సిబిఐ దాడులు ఎదుర్కొన్న రాజకీయ నాయకులు బిజెపిలో చేరిన వెంటనే విచారణలు ఆగిపోవడమే కాక, పదవులు దక్కడం మోడీ మ్యాజిక్. భావన గవాలి, ప్రతాప్ సర్నాయక్, హసన్ ముష్రిఫ్, అజిత్ పవార్, యామినీ జాదవ్, ఛగన్ భుజబల్, అశోక్ చౌహాన్...ఇలా ఎంతోమంది ఇ.డి నేరారోపణలు ఎదుర్కొని బిజెపిలో చేరిపోయి ఉన్నత స్థానాల్లో అధికారాన్ని చెలాయిస్తున్నారు. ఉదాహరణకు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ. ఈయన మొదట కాంగ్రెసు నాయకుడు. ఒకనాడు అస్సాం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆరోగ్యశాఖ మంత్రి. శారదా చిట్‌ఫండ్ కేసులో ఈయన పేరు వినిపించింది. గౌహతిలో ఈయన భార్య నిర్వహిస్తున్న న్యూస్ లైవ్ కార్యాలయంపై 2014 ఆగస్టులో సిబిఐ దాడులు చేసింది. అదే సంవత్సరం నవంబర్‌లో సిబిఐ హిమంత శర్మను విచారించింది. 2015 జనవరిలో చిట్‌ఫండ్ కేసును గౌహతి హైకోర్టు సిబిఐకి అప్పగించింది. ఆ వెంటనే హిమంత శర్మ బిజెపిలో చేరిపోయారు. అప్పటి నుండి సిబిఐ ఆయన దరిదాపులకు వెళ్లకపోగా అస్సాం ముఖ్యమంత్రిగా అధికారాన్ని చెలాయిస్తున్నారు.

**మోడీ ప్రభుత్వం 2019లో ఈ చట్టానికి చేసిన సవరణ వల్ల...ఇ.డి కి ఎవరు ఫిర్యాదు చేయకపోయినా, ఏ ఆధారాలు తనకు అందుబాటులో లేకపోయినా...నేరుగా ఇళ్ల మీద, ఆఫీసుల మీద దాడి చేసే అధికారాలను, ఎఫ్ఐఆర్ నమోదు చేసి, అరెస్టులు చేసే అధికారాలను కట్టబెట్టింది. ఈ సవరణ వల్ల బిజెపి రెండు రకాలుగా లబ్ధి పొందింది. ఇ.డి ద్వారా దాడులు చేయించి ప్రతిపక్ష రాజకీయ పార్టీల నేతలను లొంగదీసుకోవడం లేదా ప్రజల్లో అప్రతిష్టపాలు చేసి జైల్లో పెట్టడం ద్వారా తన ప్రత్యర్థులను బలహీనులను చేయడం. కార్పొరేట్ కంపెనీల ద్వారా వేల కోట్ల రూపాయలను విరాళాలుగా స్వీకరించడం. ఇందు కోసం 2019 లోనే ఎన్నికల బాండ్ల విధానాన్ని తెచ్చింది.**

మహారాష్ట్రలో అజిత్ పవార్ ఉదంతం అలాంటిదే. ఈయన ఎన్‌సిపి వ్యవస్థాపకుడు, శరద్ పవార్‌కు మేనల్లుడు. ఆ పార్టీకి జాతీయ నాయకుడు. అజిత్ పవార్‌పై అనేక కేసులున్నాయి. ముఖ్యంగా మహారాష్ట్ర స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ ఇచ్చిన రుణాలలో అక్రమాల కేసును 2019లో మహారాష్ట్రలో 'మహా వికాస్ అఘాడి' అధికారంలోకి వచ్చిన తర్వాత ఇ.డి తిరగదోడింది. అప్పటికి అజిత్ పవార్ కాంగ్రెసు- ఎన్‌సిపి ప్రభుత్వంలో జలవనరుల శాఖ మంత్రిగా వున్నారు. ఇ.డి విచారణ చేపట్టిన వెంటనే ఎన్‌సిపి పార్టీని చీల్చి బిజెపిలో చేరి దేవేంద్ర ఫడ్నవిస్‌తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆ మరుసటి రోజే బాంబే హైకోర్టు ముందు ఎసిబి అతనికి క్లీన్‌చిట్ ఇచ్చింది. మహారాష్ట్ర శివసేన ఎంపీ భావన గవాలి చైర్మెన్‌గా వున్న పబ్లిక్ ట్రస్టు ఏడు కోట్ల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఇ.డి ఆరోపించింది. ఆమె సన్నిహితుడు సయీద్ ఖాన్‌ను అరెస్టు చేసింది. భావన గవాలి ఏకనాథ్ షిండే నాయకత్వంలోని శివసేన వర్గంలో చేరడంతో కేసు మూతపడడమే కాక శివసేన చీలిక వర్గానికి పార్లమెంట్ చీఫ్ విప్‌గా ఎన్నికయ్యారు. గోవా మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకుడు దిగంబర్ కామత్ అవినీతి కేసులో విచారణ ఎదుర్కొన్నారు. 14 సూట్‌కేస్ (షెల్) కంపెనీలు పెట్టి రాజకీయ నాయకులకు కోట్లాది రూపాయలు లంచాలు ఇచ్చినట్లు ఇ.డి కేసు నమోదు చేసింది. ఆయన వెంటనే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తీసుకుని బిజెపిలో చేరారు. విచారణ ఆగిపోయింది. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడైన సువేందు అధికారి 2017లో నారద చిట్‌ఫండ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఆ తర్వాత ఇ.డి విచారణ చేపట్టింది. 2020లో బిజెపిలో చేరారు. 2021 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో మమతా బెనర్జీపై బిజెపి తరపున పోటీ చేసి గెలిచి ప్రస్తుతం ఆ రాష్ట్ర అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుడిగా కొనసాగుతున్నారు.

తెలంగాణలో ఈటెల రాజేందర్ బిఆర్ఎస్ ముఖ్య నాయకుడు. భూ కుంభకోణం కేసులో విచారణ, బిజెపిలో చేరడం, ఆ పార్టీ ఎమ్మెల్యేగా గెలవడం జరిగింది. మన రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ రాజ్యసభ సభ్యులుగా వున్న సి.ఎం.రమేష్, సుజనా చౌదరిపై బ్యాంకు కుంభకోణాల కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో తెలుగుదేశం అధికారం కోల్పోయిన వెంటనే బిజెపిలో చేరారు. ప్రస్తుతం జరగనున్న ఎన్నికల్లో ఒకరు ఎంపీగా, మరొకరు ఎమ్మెల్యేగా బిజెపి తరపున పోటీ చేస్తున్నారు. ఇ.డి దాడులు రాజకీయంగానే గాక, ఆర్థికంగానూ బిజెపిని బలపడేలా చేశాయి. ఎన్నికల బాండ్ల పేరుతో బిజెపి ఖాతాలోకి వేల కోట్ల రూపాయలు వచ్చిచేరాయని వెలుగులోకి వచ్చింది.

ఇన్ని అక్రమ, అవినీతి పద్ధతులకు పాల్పడుతున్న బిజెపికి నీతి, ధర్మం, విలువల గురించి మాట్లాడే అర్హత వుందా? ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల, రాజకీయాల పట్ల ప్రజల్లో ముఖ్యంగా యువతలో భ్రష్టుపట్టించాలనే రాజకీయ వ్యూహంలో భాగంగానే ఇన్ని రకాల అక్రమ పద్ధతులకు బిజెపి, దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ పాల్పడుతున్నాయి. వారు కోరుకునే మను ధర్మ రాజరిక పాలన ప్రజామోదం పొందాలంటే ప్రస్తుత పార్లమెంటరీ వ్యవస్థను భ్రష్టు పట్టించడం వారికి అవసరం. ప్రజాస్వామ్య వ్యవస్థకు తామే పుట్టినిల్లు అని చెప్పుకునే పెట్టుబడిదారీ వర్గం కూడా ఇందుకు తోడ్పడుతోంది. వారి దోపిడి వల్ల ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతుంది. దానివల్ల ఉత్పత్తిలో వచ్చిన సంక్షోభం నుండి బయటపడడానికి అప్పటికే ప్రజలు సృష్టించిన సంపదను కాజేయడం, ప్రకృతి వనరులను దోచేయడం చేయాలి. అందుకు రాజకీయ అధికారం తోడ్పాటు కావాలి. తమ దోపిడికి మతం చాటు కావాలి. అందుకే ప్రపంచమంతా ఈ మితవాద, మతవాద పార్టీలకు ఈ వర్గం అండగా వుండి అధికారాన్ని చేజిక్కించుకునేలా చేస్తున్నాయి. కార్పొరేట్ శక్తులు ఎన్నడూ లేనంతగా మన దేశంలో బలపడడానికి, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు పెరగడానికి ఈ బంధమే కారణం. అవినీతి, అక్రమాలను, మత రాజకీయాలను, కార్పొరేట్ దోపిడిని అడ్డుకోవాలన్నా, కొన ఊపిరితో వున్న ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవాలన్నా బిజెపిని గద్దె దించాల్సిందే.

**/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /**

# కేజ్రీవాల్ అరెస్ట్ : సమైక్యంగా నిరసన తెలియచేయాలి!

వ్యాఖ్య

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి) అరెస్టు చేసి అదుపులోకి తీసుకోవడమనేది భారతదేశంలో ప్రజాస్వామ్యం నెమ్మదిగా తుడిచిపెట్టుకు పోవడంలో కీలకమైన మలుపు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ దారుణమైన దాడి అనేక కోణాల్లో మొదటిదిగా భావించబడుతోంది. సిట్టింగ్ ముఖ్యమంత్రిని, పైగా అసెంబ్లీలో ఐదింట నాలుగు వంతుల కంటే ఎక్కువ మెజారిటీ కలిగిన పార్టీకి నాయకత్వం వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేయడం ఇదే తొలిసారి. జాతీయ పార్టీ అధినేతను కటకటాల వెనక్కి నెట్టడం కూడా ఇదే మొదటిసారి. లోక్‌సభ ఎన్నికలు ప్రకటించిన తర్వాత, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత ఇలా అరెస్టు చేయడం కూడా ఇదే ప్రథమం.

ప్రభుత్వ సాధనాలన్నింటినీ ఉపయోగించి ప్రతిపక్షాన్ని మొత్తంగా లేకుండా చేయాలన్నది పాలక పార్టీ ఉద్దేశంగా వుంది. కేంద్ర దర్యాప్తు సంస్థలను కీలకమైన ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకోవడానికి ఉపయోగిస్తున్నారు. కేజ్రీవాల్ అరెస్టుకు ముందుగా, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను ఇ.డి అదుపులోకి తీసుకుంది. ముఖ్యమంత్రి పదవికి ఆయన రాజీనామా చేసిన వెంటనే ఈ అరెస్టు చోటు చేసుకుంది. అంతకు ముందు, ఢిల్లీ డిప్యూటీ ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా కూడా అరెస్టయ్యారు. దాదాపు ఏడాది నుండి జైల్లో వున్నారు. ఇంకా అనేకమంది ప్రతిపక్ష నేతలు, మంత్రులు ఇలాగే జైల్లో వుండడమో లేదా కేంద్ర సంస్థల దర్యాప్తులను ఎదుర్కొనడమో చేస్తున్నారు. వీరందరూ కూడా బిజెపి యేతర రాష్ట్ర ప్రభుత్వాల్లోని మంత్రులు, నేతలే.

**ప్రభుత్వ సాధనాలన్నింటినీ ఉపయోగించి ప్రతిపక్షాన్ని మొత్తంగా లేకుండా చేయాలన్నది పాలక పార్టీ ఉద్దేశంగా వుంది. కేంద్ర దర్యాప్తు సంస్థలను కీలకమైన ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకోవడానికి ఉపయోగిస్తున్నారు. కేజ్రీవాల్ అరెస్టుకు ముందుగా, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను ఇ.డి అదుపులోకి తీసుకుంది. ముఖ్యమంత్రి పదవికి ఆయన రాజీనామా చేసిన వెంటనే ఈ అరెస్టు చోటు చేసుకుంది. అంతకు ముందు, ఢిల్లీ డిప్యూటీ ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా కూడా అరెస్టయ్యారు. దాదాపు ఏడాది నుండి జైల్లో వున్నారు. ఇంకా అనేకమంది ప్రతిపక్ష నేతలు, మంత్రులు ఇలాగే జైల్లో వుండడమో లేదా కేంద్ర సంస్థల దర్యాప్తులను ఎదుర్కొనడమో చేస్తున్నారు. వీరందరూ కూడా బిజెపి యేతర రాష్ట్ర ప్రభుత్వాల్లోని మంత్రులు, నేతలే.**

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ప్రతిపక్ష నేతలను, చట్టసభల సభ్యులను బెదిరించడానికి, వారు బిజెపి లోకి ఫిరాయించేలా చేయడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను చట్టవిరుద్ధంగా ఉపయోగిస్తున్నారు. ఎన్నికల బాండ్ల పథకం వివరాలన్నీ బహిర్గతమైన తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి) మోసపూరితమైన పాత్ర బయటపడింది. మద్యం విధానం కేసులో కేజ్రీవాల్‌ను ఇరికించారు. ఫార్మాస్యూటికల్ కంపెనీ 'అరబిందో ఫార్మా' మేనేజింగ్ డైరెక్టర్ శరత్‌చంద్ర రెడ్డిని ఇ.డి అరెస్టు చేసింది. 2022 నవంబరులో ఈ అరెస్టు జరిగిన ఐదు రోజుల తర్వాత ఆయన కంపెనీ రూ.5 కోట్లను ఎన్నికల బాండ్ల ద్వారా బిజెపికి విరాళంగా ఇచ్చింది. ఆ తర్వాత ఆయనకు బెయిల్ లభించింది, అప్రూవర్‌గా మారారు. నాలుగు మాసాల తర్వాత బాండ్ల ద్వారా బిజెపికి రూ.25 కోట్లు అందచేశారు. కేజ్రీవాల్ మీద, ఆప్ నేతల మీద కేసులు ఎలా మోపారో దీన్ని బట్టి తెలుస్తోంది.

ప్రతిపక్ష పార్టీలు ఇ.డి, సిబిఐల వేధింపులు, దాడులతో పాటుగా ఆదాయపన్ను అధికారుల దాడులను కూడా ఎదుర్కొంటున్నాయి. ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ 2018-19 ఆర్థిక సంవత్సరానికి రూ.135 కోట్ల మేరకు పన్నులు చెల్లించాలంటూ పంపిన నోటీసులను ఎదుర్కొంటోంది. ఈ మొత్తాన్ని ఐ.టి విభాగం రికవరీ చేసుకోవడానికి ముందుగానే ఆ పార్టీ బ్యాంక్ ఖాతాలను స్తంభింపచేశారు. ఇతర పార్టీలు కూడా ఇలాంటి చర్యలనే ఎదుర్కొంటున్నాయి. ఉదాహరణకు, 2016-17 సంవత్సరానికి సిపిఎం పన్ను మినహాయింపును ఉపసంహరించుకుంది. దేశవ్యాప్తంగా పార్టీకి గల వందలాది బ్యాంక్ ఖాతాల్లో కేవలం ఒక ఖాతాను లిస్ట్ చేయని సాంకేతికపరమైన లోపానికి గాను రూ.15.59 కోట్లను పన్నుగా చెల్లించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ఈ అవాంఛనీయ చర్యకు నిరసనగా సిపిఎం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ప్రస్తుతం ఈ విషయం న్యాయస్థానం పరిధిలో వుంది.

ఎన్నికల బాండ్ల ద్వారా ప్రతిపక్షాలకు చట్టపరమైన నిధులను నిలిపివేస్తుంది. ఆ తర్వాత, ఎన్నికల బాండ్ల ద్వారా కార్పొరేట్ల విరాళాలపై గుత్తాధిపత్యం వహిస్తుంది. తర్వాత, జరిమానాలు విధించడం ద్వారా ప్రతిపక్షాలను ఆర్థికంగా ఇరుకున పెట్టడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

ఎన్నికైన ఢిల్లీ ప్రభుత్వ అధికారాలపై వ్యవస్థాగతమైన దాడులకు పాల్పడిన తర్వాత కేజ్రీవాల్ అరెస్టు చోటు చేసుకుంది. ప్రతిపక్ష పార్టీల మాదిరిగానే ప్రతిపక్షాల పాలనలో వున్న రాష్ట్ర ప్రభుత్వాలు కూడా దాడులను ఎదుర్కొంటున్నాయి. సమాఖ్యవాద సూత్రాలపైనే దాడులకు తెగబడడంతో ఇవన్నీ చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ అరెస్టును భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పొంచి వున్న ముప్పుగా చూడాలి. ఇక ఎలాంటి సాకులు లేవు, వున్న ముసుగు కూడా తొలగించబడింది. నియంతృత్వ ప్రభుత్వం ఎన్నికల నిరంకుశత్వాన్ని రుద్దుతోంది. ఎన్నికల కమిషన్, కార్యనిర్వాహక వర్గం అధీనంలో వుంది. విరుచుకుపడుతున్న ప్రభుత్వంతో ఘర్షణ పడేందుకు ఉన్నత న్యాయవ్యవస్థ నిరాకరిస్తోంది.

ఇటువంటి పరిస్థితుల్లో లౌకిక, ప్రజాస్వామ్య శక్తులన్నీ కలిసి ప్రజల వద్దకు వెళ్ళడం, ప్రజాస్వామ్యానికి, పౌరుల హక్కులకు కలుగుతున్న ముప్పుకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించడం తప్ప మరో మార్గం లేదు. ప్రజల నిరసనలు కేవలం ఢిల్లీకే పరిమితం కారాదు. దేశవ్యాప్తంగా ప్రతి చోటా వ్యాపించాలి, జరగాలి. మార్చి 31న ఢిల్లీలో 'ఇండియా' బ్లాక్ పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తోంది. కేరళ ఈ విషయంలో ఇప్పటికే మార్గనిర్దేశనం చేసింది. అక్కడ రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ప్రజా నిరసనలు, ప్రచారాలు, ఆందోళనలు చేపట్టడం, జరగడం అత్యంత ముఖ్యం. ప్రజా సమీకరణ ఈ రీతిలో చోటు చేసుకుంటే కచ్చితంగా ఎన్నికల్లో అది బిజెపిని దెబ్బతీస్తుంది.

**(మార్చి 27 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)**

జనవాక్యం

## మెదడు లేదా!

సద్గురు బాబాగా పిలవబడే జగ్గి వాసుదేవ బాబా తలకు ఇటీవల ఆపరేషన్ చేశారు. ఆ తర్వాత బాబా మాట్లడుతూ తన తలలో ఏదో ఉందని డాక్టర్లు ఆపరేషన్ చేశారని, ఏమీ లేకపోవటంతో వెంటనే కుట్లు వేశారని చెప్పాడు. నిజమే ఆయన తలలో మెదడు కూడా లేదని ప్రజలకు ఎప్పుడో తెలుసు. కాకపోతే ఆయన ఇపుడు తెలుసుకున్నాడు. ఒక్క జగ్గి బాబాకే కాదు. ఏ బాబాకీ మెదడు ఉన్నా సరిగా పనిచెయ్యదు. ఇలాంటి దొంగబాబాల దగ్గరకు వెళ్ళే వారికి కూడా మెదడు లేదనుకోవాలి. ఇకపోతే కోయంబత్తూర్ దగ్గర సద్గురు బాబా ఆశ్రమంలో శివరాత్రికి 112 అడుగుల శివుని విగ్రహాన్ని ప్రధాని ఆవిష్కరించారు. ఆ స్థలం గిరిజనులది కాగా మద్రాస్ హైకోర్టు ఆ స్థలం గిరిజనులదేనని చెప్పింది. మరి నిఘా సంస్థలు ఏంచేస్తున్నాయో? ఈ విధంగా దొంగబాబాల ఆశ్రమాలు నేర సామ్రాజ్యాలుగా మారుతుంటే, ఈ ఆశ్రమాలకు ప్రధానులు, రాష్ట్రపతులు, ముఖ్యమంత్రులు అధికారికంగా వెళ్ళి, రాజ్యాంగంలో రాసుకున్న లౌకికవాదాన్ని మంటగలుపుతున్నారు. కనుక బుర్రలు లేని బాబాల దగ్గరకెళ్లి ప్రజలు కూడా బుర్ర లేనివారుగా తయారు కావద్దు.

**- నార్నె వెంకట సుబ్బయ్య**

**మీ రచనలను పంపాల్సిన మెయిల్ :**
editpageps@gmail.com

# బిజెపికి 'కోటక్' నజరానా

- రూ.60 కోట్ల విరాళం
- కోటక్ మహీంద్రా బ్యాంకుకు అనుకూలంగా వ్యవహరించిన ఆర్‌బిఐ
- ఆ తర్వాత కాషాయం పార్టీ ఖాతాకు చేరిన సొమ్ము

**న్యూఢిల్లీ :** ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసిన వారి జాబితాలో అరుదుగా కన్పించిన పేరు ఉదయ్ కోటక్. దేశంలో మూడవ అతి పెద్ద ప్రయివేటు రంగ బ్యాంకైన కోటక్ మహీంద్రాలో ఆయనకు వాటాలు ఉన్నాయి. అయితే తాను నిర్దేశించిన పరిమితికి మించి ఉదయ్‌కి ఆ బ్యాంకులో వాటాలు ఉన్నాయని రిజర్వ్ బ్యాంక్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారం చివరికి 2018 డిసెంబరులో న్యాయస్థానం వరకూ వెళ్లింది. ఆర్‌బిఐకి వ్యతిరేకంగా కోటక్ మహీంద్రా బ్యాంక్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఏమైందో ఏమో కానీ 13 నెలలు గడిచిన తర్వాత 2020 జనవరిలో ఆర్‌బిఐ వెనక్కి తగ్గింది. కోర్టు వెలుపల పరిష్కారం చేసుకుందామంటూ కోటక్ మహీంద్రా బ్యాంక్ చేసిన ప్రతిపాదనను అంగీకరించింది.

ఇదిలా ఉండగా ఈ వివాద పరిష్కారానికి కొన్ని నెలల ముందు ఈ గ్రూపు బిజెపికి రూ.35 కోట్ల విరాళం అందజేసింది. పరిష్కార ప్రకటన వెలువడడానికి కొద్ది రోజుల ముందే ఇందులో రూ.10 కోట్లు బిజెపి పార్టీ ఖాతాలో చేరాయి. ఆ తరువాత కోటక్ గ్రూపునకు చెందిన ఇన్ఫినా ఫైనాన్స్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ 2021 ఏప్రిల్‌లో బిజెపికి రూ.25 కోట్లు సమర్పించుకుంది. కోటక్ మహీంద్రా బ్యాంక్ ఎండీగా, సీఈఓగా ఉదయ్ కోటక్ మరో 32 నెలల పాటు పదవిలో కొనసాగేందుకు అనుమతిస్తూ ఆర్‌బిఐ మార్గదర్శకాలు జారీ చేసి మూడు వారాలు కూడా గడవక ముందే ఈ విరాళం బిజెపి జేబులో చేరింది. రేటింగ్ సంస్థ కేర్ రేటింగ్స్ ప్రకారం ఇన్ఫినా ఫైనాన్స్‌లో కోటక్ కుటుంబానికి 50.01 శాతం వాటాలు, ముంబయికి చెందిన కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ లిమిటెడ్‌కు 39.99 శాతం వాటాలు ఉన్నాయి. మహీంద్రా క్యాపిటల్ కంపెనీ లిమిటెడ్‌లో ఉదయ్ కోటక్ డైరెక్టరుగా వ్యవహరిస్తున్నారు. ఇన్ఫినా ఫైనాన్స్ కొనుగోలు చేసిన మొత్తం రూ.60 కోట్ల బాండ్లు ఒకే పార్టీ...బిజెపి ఖాతాకే చేరడం గమనార్హం.

**వివాదం ఏమిటి?**

ఏదైనా కంపెనీ వ్యాపారాన్ని ప్రారంభించిన తర్వాత 12 సంవత్సరాల వరకూ ప్రమోటర్లు అందులో 15%కి మించి వాటాలు కొనుగోలు చేయరాదని ఆర్‌బిఐ 2013 ఫిబ్రవరి 22న మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రమోటర్ వాటాను 2017 జూన్ 30 లోగా 30%కి, 2018 డిసెంబర్ 31 లోగా 20%కి, 2020 మార్చి 31 లోగా 15%కి తగ్గించాలని ఆర్‌బీఐ తనకు సూచించిందని కోటక్ బ్యాంక్ తెలిపింది. 2017 మే 22న కోటక్ బ్యాంకులో తన వాటాను ఉదయ్ కోటక్ 29.79%కి తగ్గించారు. 2018 ఆగస్ట్ 2న ప్రమోటర్ వాటాను 30 శాతం నుండి 19.7 శాతానికి తగ్గించేందుకు కొత్త పద్ధతిని అనుసరించాలని కోటక్ బ్యాంక్ నిర్ణయించింది. అయితే అందుకు ఆర్‌బిఐ అంగీకరించలేదు. దీనిపై కోటక్ బ్యాంక్ బాంబే హైకోర్టును ఆశ్రయించింది. ఆ తర్వాత ఇన్ఫినా ఫైనాన్స్ కంపెనీ రెండు దఫాలుగా బిజెపి ఖాతాలో రూ.35 కోట్ల డిపాజిట్ చేసింది. కోటక్, ఆర్‌బీఐ 2020 జనవరి 29న కోర్టు వెలుపల పరిష్కారం కుదుర్చుకున్నాయి.

## సీ-విజిల్ ద్వారా 79 వేల ఫిర్యాదులు : సిఇసి

**న్యూఢిల్లీ :** ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసేందుకు తాము ప్రారంభించిన సీ-విజిల్ మొబైల్ అప్లికేషన్‌కు మంచి స్పందన లభిస్తోందని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించినప్పటి నుండి 79,000కు పైగా ఫిర్యాదులు అందాయని చెప్పింది. 99 శాతం ఫిర్యాదులను పరిష్కరించామని, వీటిలో 89 శాతం ఫిర్యాదులను అవి అందిన వంద నిమిషాలలోనే పరిష్కరించినట్లు వివరించింది.

మొత్తం అందిన ఫిర్యాదుల్లో 73 శాతం (58,500 ఫిర్యాదులు) అక్రమ హోర్డింగులు, బ్యానర్లకు సంబంధించిన వేనని సీఈసీ తెలిపింది. డబ్బు, బహుమతులు, మద్యం పంపిణీకి సంబంధించి 1,400 ఫిర్యాదులు అందాయని చెప్పింది. ఆస్తులకు నష్టం కలిగించారన్న ఆరోపణలపై ఈసీకి 2,454 (3%) ఫిర్యాదులు అందాయి. ఆయుధాలు ధరించడం, భయపెట్టడం వంటి ఉదంతాలకు సంబంధించి 535 ఫిర్యాదులు అందగా వాటిలో 529 ఫిర్యాదులను పరిష్కరించారు..

## సత్యేందర్ జైన్‌పై సిబిఐ దర్యాప్తు

**న్యూఢిల్లీ :** తీహార్ జైల్లో ఉన్న ఢిల్లీ మంత్రి, ఆప్ నాయకులు సత్యేందర్ జైన్‌పై సిబిఐ దర్యాప్తునకు కేంద్ర హోం శాఖ అనుమతిచ్చింది. అవినీతి నిరోధక చట్టం కింద సిబిఐ దర్యాప్తు కోరుతూ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఫిబ్రవరిలో చేసిన సిఫార్సులకు అనుగుణంగా దర్యాప్తునకు అనుమతిచ్చింది. జైల్లో తనకు రక్షణ కల్పిస్తానంటూ మంత్రి సత్యేందర్ జైన్ తన నుంచి బలవంతంగా రూ.10 కోట్లు వసూలుచేశారన్న ఆర్థిక నేరస్థుడు సుకేశ్ చంద్రశేఖర్ ఆరోపణలపై ఈ దర్యాప్తు జరగనుంది. ఈ వ్యవహారంలో జైన్ సహా తీహార్ జైలు మాజీ డీజీ సందీప్ గోయెల్ నిందితులుగా ఉన్నారు. సుకేశ్, సత్యేంద్ర జైన్ ఇద్దరూ ప్రస్తుతం తీహార్ జైల్లోనే ఉన్నారు.

## తెలంగాణ సిఎంతో కెకె భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో బిఆర్‌ఎస్ రాజ్యసభ ఎంపి కె.కేశవరావు, తన కుమార్తె జిహెచ్‌ఎంసి మేయర్ విజయలక్ష్మితో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. కెకెను సిఎం రేవంత్ కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం కెకె విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో బిఆర్‌ఎస్ కష్టకాలంలో ఉందని.. దేశంలో కాంగ్రెస్ కష్టకాలంలో ఉందని అందుకే ఆ పార్టీలోకి వెళ్తున్నానని కెకె తెలిపారు. ఢిల్లీ పెద్దలతో సంప్రదింపులు జరుపుతున్నామని.. అతి త్వరలో తన కుమార్తెతో కలిసి సొంతగూటికి చేరుతున్నట్లు చెప్పారు. అవసరమైతే తన రాజ్యసభ సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తానని వెల్లడించారు. తెలంగాణ గురించి బిఆర్‌ఎస్ కంటే ముందే కాంగ్రెస్ ఫోరం ఫర్ తెలంగాణ ముందే ఆలోచించిందని అన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తెలంగాణ మాజీ డిసిపికి రిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో తెలంగాణ మాజీ డిసిపి రాధాకిషన్‌రావుకు నాంపల్లి కోర్టు శుక్రవారం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డిసిపిగా, ఉద్యోగ విరమణ అనంతరం అక్కడే ఒఎస్‌డిగా సుదీర్ఘకాలం పనిచేసిన రాధాకిషన్‌రావును పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్‌ఐబి)లో పనిచేసిన సమయంలో డిఎస్‌పి(సస్పెండెడ్) దుగ్యాల ప్రణీత్‌రావు ఫోన్‌ట్యాపింగ్ ద్వారా ఇచ్చిన సమాచారం ఆధారంగా క్షేత్రస్థాయిలో రాధాకిషన్‌రావు బృందం అనధికారిక ఆపరేషన్లు చేపట్టిందనే ఆరోపణలున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన సిఐ గట్టుమల్లు విచారణ కూడా ముగిసింది. టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్‌రావు ఆదేశాలతో పనిచేసినట్లు గట్టుమల్లు చెప్పినట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటికే అదనపు ఎస్‌పిలులు భుజంగరావు, తిరుపతన్నను ఏప్రిల్ రెండు వరకు ఐదు రోజుల పోలీసు కస్టడీకి తీసుకున్నారు.

**భార్యభర్తల మాటలు విన్నారు :** సిఎం రేవంత్

గత ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ చేసి, భార్యాభర్తలు ఏం మాట్లాడుకున్నారో కూడా విన్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ట్యాపింగ్ చేసి వింటే ఏమవుతుందంటూ మాజీ మంత్రి కెటిఆర్ మాట్లాడుతున్నారనీ, అలా చేసిన వారు జైల్లో చిప్పకూడు తినాల్సి వస్తుందనిహెచ్చరించారు. ట్యాపింగ్‌పై విచారణ జరుగుతుందనీ, తప్పకుండా చర్యలు ఉంటాయని చెప్పారు.

## విద్యార్థిని ఆత్మహత్య!

(మొదటిపేజీ తరువాయి)

కాలేజీ యాజమాన్యం గురువారం రాత్రి సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి 12.50 గంటల తర్వాత అమ్మాయి వాష్ రూమ్ నుంచి బయటకొచ్చి నాలుగు అంతస్తుల భవనంపైకి వెళ్లినట్లు సిసి కెమెరాల్లో రికార్డు అయిందని అక్కడి వారు, అర్ధరాత్రి సమయంలో పెద్ద శబ్దం వచ్చిందని, కింద చూస్తే అమ్మాయి పడి ఉందని హాస్టల్ వాచ్‌మ్యాన్ చెబుతున్నారు.

**కళాశాల వద్ద విద్యార్థి సంఘాలు, ఐద్వా ఆందోళన**

విద్యార్థిని మృతిపై సగ్రమ విచారణ జరపాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని, కాలేజీ గుర్తింపు రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్, ఐద్వా ఆధ్వర్యాన కళాశాల వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, ఐద్వా మధురవాడ జోన్ నాయకులు భారతి, సిఐటియు నాయకులు రాజ్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థిని తన తండ్రికి పంపిన వాట్సాప్ మెసేజ్‌ను మీడియాకు చూపించారు.

## లోక్‌సభ ఎంపిల్లో 225 మందిపై క్రిమినల్ కేసులు

**న్యూఢిల్లీ :** ప్రస్తుత లోక్‌సభలోని 514 మంది సిట్టింగ్ ఎంపీల్లో 225 మందిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఈ విషయం అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) అధ్యయనంలో వెల్లడైంది. గతంలో ఎంపీలు సమర్పించిన అఫిడవిట్లను విశ్లేషించిన ఎడిఆర్ పలు వివరాలతో ఈ నివేదిక విడుదల చేసింది. అలాగే ఈ నివేదిక ప్రకారం.. ఎంపిల్లో 5 శాతం మంది కోటీశ్వరులు ఉన్నారు. వీరి ఒక్కొక్కరి సంపద రూ.100 కోట్లకు పైమాటే. క్రిమినల్ కేసులు నమోదైన వారిలో 29 శాతం మందిపై హత్య, హత్యాయత్నం, మత విద్వేషాలను రెచ్చగొట్టడం, కిడ్నాప్, మహిళలపై నేరాలకు పాల్పడటం లాంటి తీవ్రమైన కేసులు ఉన్నాయి. మొత్తం 9 మందిపై హత్య కేసులు నమోదుకాగా.. వారిలో ఐదుగురు బిజెపికి చెందినవారే. 28 మందిపై హత్యాయత్నం కేసులు నమోదైతే.. వారిలో 21 మంది బిజెపికి చెందినవారే కావడం గమనార్హం. మహిళలపై నేరాలకు సంబంధించి 16 కేసులు, 3 అత్యాచారం కేసులు నమోదయ్యాయి. అలాగే కోటీశ్వర్లలో ఎక్కువ మంది బిజెపి, కాంగ్రెస్‌లకు చెందినవారే. ధనిక ఎంపీల్లో కాంగ్రెస్‌కు చెందిన నకుల్‌నాథ్ ప్రథమ స్థానంలో ఉండగా.. తర్వాతి స్థానాల్లో డీకే సురేశ్ (కాంగ్రెస్), కనుమూరు రఘురామ కృష్ణరాజు ఉన్నారు. ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఎంపీలపైనే ఎక్కువగా క్రిమినల్ కేసులు నమోదైనట్లు ఏడీఆర్ విశ్లేషణలో తేలింది.

## ఉపా కింద బ్యాంక్ ఖాతాలను స్తంభింపచేయలేరు

- మద్రాసు హైకోర్టు రూలింగ్

**చెన్నై :** చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం (ఉపా) 1967 కింద బ్యాంక్ ఖాతాలను స్తంభింపచేయలేమని మద్రాసు హైకోర్టు రూలింగ్ ఇచ్చింది. నిషేధిత సంస్థ కోసం ఆ ఖాతాల్లోని నిధులు ఉపయోగిస్తున్నారు లేదా వాటి కోసం నిర్దేశించబడ్డాయని కేంద్రం విచారణ ద్వారా రుజువు చేసుకుంటే తప్ప ఆ ఖాతాలను ఉపా కింద స్తంభింప చేయలేరని కోర్టు పేర్కొంది.

చెన్నైకి చెందిన తమిళనాడు డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ట్రస్టు సేవింగ్స్ బ్యాంక్ ఖాతాను స్తంభింప చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను కోర్టు కొట్టివేసింది. జస్టిస్ ఎం.ఎస్.రమేష్, జస్టిస్ సుందర్ మోహన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ మేరకు రూలింగ్ జారీ చేసింది. యుఎపిఎ కింద నిషేధించబడిన సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్‌ఐ)కి ఈ ఖాతాల ద్వారా సహాయమందిస్తున్నట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇటువంటి నిషేధాజ్ఞపు ఆదేశాలు జారీ చేయడానికి ముందుగా అనుసరించాల్సిన విధి విధానాలను యుఎపిఎలోని సెక్షన్ 7(1) నిర్దేశిస్తోందని, అసలు ఇటువంటి నిధుల వినియోగాన్ని నిషేధించే అధికారాన్ని సెక్షన్ 7 కేంద్రానికి ఇస్తోందని న్యాయమూర్తులు పేర్కొన్నారు. అయితే వీటికి ముందుగా సక్రమమైన విచారణ లేదా దర్యాప్తు జరగాల్సి వుంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుత కేసులో కేంద్ర ప్రభుత్వం ఆ రీతిలో వ్యవహరించలేదన్నారు. కానీ డిజిటల్ పరికరాల నుండి స్వాధీనం చేసుకున్న కొన్ని పత్రాలపై ఆధారపడి ఈ చర్యలకు పాల్పడిందని వారు పేర్కొన్నారు.

## 'కేజ్రీవాల్ కో ఆశీర్వాద్'

- క్యాంపెన్ ప్రారంభించిన కేజ్రీవాల్ సతీమణి
- వాట్సాప్ నెంబర్ కు విషెస్ పంపాలని సునీత విజ్ఞప్తి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సతీమణి సునీత 'కేజ్రీవాల్ కో ఆశీర్వాద్' వాట్సాప్ క్యాంపెన్ కు ప్రారంభించారు. అక్రమ కేసులో జైళ్లో ఉన్న తన భార్త, ఢిల్లీ సిఎంకు ప్రజలు తమ ఆశీర్వాదాలు పంపాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం సుమారు 3:30 నిమిషాల వీడియోను సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. దేశంలోని అత్యంత నియంతృత్వ, అవినీతి శక్తులతో తన భర్త పోరాడుతున్నారని చెప్పారు. ఈ పోరాటంలో కేజ్రీవాల్ కు అండగా నిలవాలని కోరారు. అందుకోసం 8297324624 నెంబర్ కు వాట్సాప్ ద్వారా సందేశాలు పంపాలని కోరారు. శుక్రవారం నుంచే 'కేజ్రీవాల్ కో ఆశీర్వాద్' క్యాంపెన్ ను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఆశీర్వాదం, మద్దతు, అభినందనలే కాకుండా... ఇతర ఏ సందేశాలనైనా ఈ వాట్సాప్ నెంబర్ కు పంపవచ్చని తెలిపారు. 'అవినీతి పరులపై పోరాడేందుకు మద్దతు కావాలని కేజ్రీవాల్ కోర్టులో చెప్పారు. 'గత 30 ఏళ్లుగా కేజ్రీవాల్ తో కలిసి జీవిస్తున్నాను. నాభర్త రోమ రోమానా దేశభక్తి ఉంది. దేశంలోని బలమైన నియంతృత్వ, అవినీతి పరులతో ఆయన పోరాడుతున్నారు. ఆయనకు మీ మద్దతు తెలపండి ' అని వీడియో సందేశంలో ప్రజలను కోరారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో సిఎం కేజ్రీవాల్ ను ఈ నెల 21 ఇడి అరెస్ట్ చేసింది. ప్రస్తుతం ఆయన ఇడి కస్టడీలో ఉన్నారు.

## ఉత్తర కొరియాపై ఆంక్షలను ఖండించిన రష్యా

**మాస్కో:** ఉత్తర కొరియాపై ఐక్యరాజ్యసమితి విధించిన ఆంక్షలను రష్యా ఖండించింది. ఈ ఆంక్షలు కొరియా ద్వీపకల్పంలో శాంతిని పెంపొందించడానికి అడ్డంకిగా ఉన్నాయని రష్యా విమర్శించింది. అలాగే ప్రాంతీయ భద్రతను మెరుగుపరిచేందుకు ఇవి ఏమాత్రం ఉపయుక్తంగా లేవని తెలిపింది. ఉత్తర కొరియా అణు కార్యక్రమంపై విధించిన ఆంక్షలను పర్యవేక్షించేందుకు నిపుణులతో వేసిన కమిటీ పదవీ కాలాన్ని పొడిగించేందుకు భద్రతా మండలిలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని గురువారం రష్యా తన వీటో అధికారంతో అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలోనే రష్యా ఈ వ్యాఖ్యలు చేసింది. కొరియా ద్వీపకల్ప ప్రాంతంలో భద్రత పరిస్థితులను మెరుగుపరిచేందుకు గత కొన్ని ఏళ్లుగా తీసుకున్న అంతర్జాతీయ నియంత్రణ చర్యలు ఏమాత్రం ఉపయోగపడలేదని రష్యా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మారియా జఖరోవా మీడియాకు తెలిపారు. ఆంక్షల చర్యలను క్రమంగా తగ్గించేందుకు, వాటిని సమీక్షించేందుకు సరైన యంత్రాంగాలు లేనప్పుడు ఇలాంటి చర్యల వల్ల ఏ ఫలితం ఉండబోదని అన్నారు. ఐరాస నిపుణుల కమిటీ పదవీ కాలాన్ని పొడిగించేందుకు రష్యా వ్యతిరేకించడంతో కమిటీ పర్యవేక్షణ నిలిచిపోనుంది. అయితే ఉత్తర కొరియా అణు కార్యక్రమంపై ఆంక్షలు మాత్రం కొనసాగుతాయి.

# సిరియాపై ఇజ్రాయిల్ దాడులు ఉధృతం

- 42మంది మృతి
- గాజాలో 70మందికి పైగా మృతి

**గాజా/ అలెప్పో :** సిరియాలోని ఉత్తర రాష్ట్రమైన అలెప్పోలో ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడుల్లో 42మంది మరణించారని సిరియా అధికారిక వార్తా సంస్థ సనా తెలిపింది. వీరిలో ఎక్కువమంది సైనికులే వున్నారు. హిజ్బుల్లా తిరుగుబాటుదారులు ఆరుగురు చనిపోయినట్లు ఓ టివి చానెల్‌లో తెలిపింది. ఈ దాడుల్లో డజన్ల సంఖ్యలో గాయపడినట్లు బ్రిటన్ కేంద్రంగా పనిచేసే సిరియా మానవ హక్కుల కార్యాలయం (ఎస్‌ఓహెచ్‌ఆర్) తెలిపింది. అలెప్పోలోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని శుక్రవారం తెల్లవారు జామున 1.45గంటల తర్వాత ఈ దాడులు మొదలైనట్లు సిరియా రక్షణ మంత్రిత్వ శాఖ కార్యాలయం తెలిపింది. అలెప్పో అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఆయుధాల డిపోపైనా ఇజ్రాయిల్ వైమానిక దాడులు జరిపింది. ఇజ్రాయిల్ గాజాతో బాటు ఇరాన్ మిత్రదేశమైన సిరియాపై కూడా వరుస దాడులకు దిగుతోంది. గాజా కరువు బారిన పడే పరిస్థితులను నిలువరించాలని, వెంటనే ఇందుకు సంబంధించి చర్యలు చేపట్టాలని అంతర్జాతీయ న్యాయ స్థానం గురువారం రూలింగ్ ఇచ్చినప్పటికీ ఇజ్రాయిల్ తన ఘర్షణ ధోరణిని విడనాడడం లేదు. హిజ్బుల్లాపై దాడులను కొనసాగిస్తూనే వుంది. ఈ దాడులు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని, సిరియా సార్వభౌమాధికారాన్ని దెబ్బతీస్తున్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం వ్యాఖ్యానించింది.

**గాజాలో 70మందికి పైగా మృతి**

గత 24గంటల్లో ఇజ్రాయిల్ హంతక దాడుల్లో 71మంది పాలస్తీనియన్లు మరణించగా, మరో 112మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. గాజాలోని స్పోర్ట్స్ సెంటర్‌పై ఇజ్రాయిల్ జరిపిన దాడిలో 15మంది మృతి చెందగా, జబాలియా శరణార్థి శిబిరంలోని అబి వక్రాస్ మసీదుపై జరిపిన బాంబు దాడిలో పలువురు గాయపడ్డారు. ఆహారం, నీరు, ఇంధనం, వైద్య సరఫరాలతో సహా గాజాలోని ప్రజలకు ఎలాంటి అడ్డంకులు, అవాంతరాలు లేని రీతిలో మౌలిక సౌకర్యాలు అందించాలని, మానవతా సాయం పెంపొందించాలని, ఎలాంటి జాప్యం లేకుండా ఇందుకు సంబంధించి చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ న్యాయ స్థానం (ఐసిజె) జారీ చేసిన ఆదేశాలను కూడా నెతన్యాహు ప్రభుత్వం ధిక్కరిస్తోంది.

గాజాలో పరిస్థితులు క్షీణిస్తున్నాయని, మానవ తప్పిదం వల్ల జరిగే ఈ పెను విషాదాన్ని నివారించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాల్సి వుందని ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ చీఫ్ ఫిలిప్ లాజారిని పేర్కొన్నారు.

## రాజధాని లేకుండా చేసిన జగన్

(మొదటిపేజీ తరువాయి)

బిజెపితోనూ కలిసి కూటమిగా ఏర్పడి ఎన్నికల బరిలోకి దిగామన్నారు. ముస్లిం మైనార్టీలు ఎవ్వరూ భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. గతంలో కూడా ఎన్‌డిఎతో రెండుసార్లు కలిసి ఉన్నానని, ముస్లిం మైనార్టీలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మతసామరస్యాన్ని కాపాడుతూ వచ్చామని అన్నారు. ముస్లిముల పరిస్థితి ఏమిటనే అభద్రతా భావనలో మైనార్టీలు ఉన్నారని, వారెవ్వరికీ అన్యాయం జరగకుండా చూసే బాధ్యత నాదని చెప్పుకొచ్చారు. ఐదేళ్లలో రాష్ట్రాన్ని జగన్ అథోగతి పట్టించారని, ఉద్యోగులను, నిరుద్యోగ యువతను మభ్యపెట్టారని, వైసిపి ప్రభుత్వంలో ఏ వర్గానికీ మేలు జరగలేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది అక్రమ కేసులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా మార్పు కనిపిస్తోందని, ప్రభుత్వ అరాచకానికి మే 13న తెరపడనుందని, రాష్ట్రంలో మార్పు రానుందని పేర్కొన్నారు.

**కదిరి, బనగానపల్లెల్లో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో చంద్రబాబు**

శ్రీసత్యసాయి జిల్లా కదిరి, నంద్యాల జిల్లా బసనగానపల్లెల్లో జరిగిన టిడిపి ఆవిర్భావ దినోత్సవాల్లో చంద్రబాబు పాల్గొన్నారు. కదిరిలో టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి జెండాను ఎగురవేసి కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు. బనగానపల్లెలోనూ టిడిపి జెండాను చంద్రబాబు ఎగరవేశారు.

సిపిఎం, సిపిఐ నాయకులు అరెస్టు చేస్తున్న పోలీసులు

## 58 నెలల్లో విప్లవాత్మక మార్పులు

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతోందన్నారు. రైతన్నలు తమను భుజం తట్టి ప్రోత్సహించాలని కోరారు. సామాజిక న్యాయం ఎలా చేయాలో చేసి చూపించామన్నారు. 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశామని, అందులో 80 శాతం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు ఇచ్చామని, నామినేటెడ్ పదవులు, కాంట్రాక్టుల్లో 50 శాతం వారికే ఇచ్చేలా చట్టం చేశామని వివరించారు. చేసిన మంచితో ఎన్నికలకు వెళ్తున్నామన్నారు. చంద్రబాబు కూటమి పేరుతో కుట్రలు చేసేందుకు వస్తున్నారని విమర్శించారు. మే 13న కురుక్షేత్ర యుద్ధం జరగబోతుందన్నారు. ఈ పొత్తులను, జిత్తులను, మోసాలను, కుట్రలను ఎదుర్కొంటూ పేదల భవిష్యత్తుకు అండగా నిలిచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. జెండాలు జతకట్టిన పార్టీలకు, పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే అడ్డుకున్న పార్టీలకు సమాధి కట్టాలని కోరారు. ఎస్‌సిలను అవమానించిన వారికి రాజకీయ భవిష్యత్తు లేకుండా చేయాలని, బిసిల తోకలు కత్తిరిస్తామన్న వారికి తోకలు కత్తిరించాలని అన్నారు. చంద్రబాబు పేరు చెబితే మోసాలే గుర్తొస్తాయని విమర్శించారు. మళ్లీ మోసం చేసేందుకు రంగురంగుల మేనిఫెస్టోతో వస్తున్నారని, దత్తపుత్రుడిని, ఢిల్లీ నుంచి మోడీని తోడు తెచ్చుకున్నారని దుయ్యబట్టారు. 2014లో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. అనంతరం ఆరెకల్, ఆదోని క్రాస్, విరుపాపురం, ఆస్పరి, చిన్నహుల్తి, పత్తికొండ బైపాస్ మీదుగా పత్తికొండ చేరుకొని కెజిఎన్ ఫంక్షన్ హాలులో రాత్రి బస చేశారు. బహిరంగ సభలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం, వైసిపి రీజినల్ సమన్వయకర్త రామసుబ్బారెడ్డి, ఎంపి గోరంట్ల మాధవ్, కర్నూలు ఎంపి అభ్యర్థి బివై.రామయ్య, ఎమ్మెల్యే అభ్యర్థులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించండి

- సిఎంకు విన్నవించేందుకు వామపక్ష నాయకులకు అనుమతి నిరాకరణ
- రహదారిపై ప్లకార్డులతో నిరసన, అరెస్టు, విడుదల

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా కోడుమూరులో తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోందని, సమస్యను పరిష్కరించేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఏర్పాటు చేయాలని సిపిఎం, సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో కోడుమూరులో వైసిపి నిర్వహించిన సభలో సిఎంను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు నాయకులు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు ప్లకార్డులతో నిరసన తెలిపారు. దాదాపు గంటకుపైగా నగరంలోని హిందుస్థాన్ హోటల్ ఎదుట నిరసన తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి గఫూర్, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కామార్తి రాజు, సిపిఐ మండల కార్యదర్శి డి రాజు, ఆటో యూనియన్ నాయకులు ఎం.మధు నాయకులు అక్బర్‌ను బలవంతంగా పోలీసులు అరెస్టు చేశారు. సభ అనంతరం వారిని విడిచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కోడుమూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను , ఉర్దూ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణంలో అత్యధికంగా జనాభా కలిగిన చేనేత కార్మికులకు వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

**బహిరంగ ప్రకటన**

ICICI Home Finance

**రిజిష్టర్డు ఆఫీసు:** ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా కూర్ల కాంప్లెక్స్, బాంద్రా (ఇ), ముంబయి-400051

**కార్పొరేట్ ఆఫీసు:** ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్, జెబి నగర్, అంధేరి కూర్ల రోడ్, అంధేరి ఈస్ట్, ముంబయి-400059

**బ్రాంచ్ చిరునామా:** సుప్రియా టవర్స్, అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్, డోర్ నెం.5-37-155, 4/15 బ్రాడిపేట్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002

దిగువ పేర్కొన్న రుణగ్రహీత/లు వారు ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ("ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి") నుండి పొందిన రుణ సదుపాయాలకు సంబంధించి అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించుటలో డిఫాల్ట్ చెందినందున మరియు రుణాలు నాన్-పెర్ఫామింగ్ అసెట్స్ (ఎన్‌పిఏ)గా వర్గీకరించబడినవి. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్-2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసును వారి గతంలో తెలిసిన చిరునామాలు కలిగిన వారికి నోటీసు జారీచేయబడినది, అయితే, అది వారికి చేరకుండానే వెనుదిరిగింది కావున, ఈ బహిరంగ ప్రకటన రూపేనా తెలియజేస్తున్నాము.

| క్ర. సం. | రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు పేరు/ (రుణ ఖాతా నెంబరు) & చిరునామా | సెక్యూర్డ్ అసెట్/ స్వాధీనం చేసుకొను ఆస్తి చిరునామా | నోటీసు పంపిన తేదీ/ నోటీసు తేది నాటికి బకాయి మొత్తాలు | ఎన్‌పిఏ తేదీ |
|---|---|---|---|---|
| 1. | అనిల్ కుమార్ అడిపె (రుణగ్రహీత), శాంతి స్వరూపా రాణి అడిపే (సహ-రుణగ్రహీత), డోర్ నెం.26 28 279 1 అగ్రహారం 2వ లైన్ గుంటూరు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522004. LHGTR00001439022 | ఫ్లాట్ నెం.04, 3వ అంతస్తు, మా ప్లాజా గ్రూప్ హౌసింగ్, నల్లపాడు గ్రామం, గుంటూరు 179/సి, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002. సరిహద్దులు: ఉత్తరం: ఉమ్మడి కారిడార్, దక్షిణం: గ్రౌండ్‌లో ఓపెన్ ఏరియా, తూర్పు: గ్రౌండ్‌లో ఓపెన్ ఏరియా, పడమర: గ్రౌండ్‌లో ఓపెన్ ఏరియా | 18-03-2024 Rs. 30,66,741/- | 09/03/2024 |

నోటీసు సరిగా బట్వాడాఅగుట కొరకు తగిన చర్యలు తీసుకోబడుతున్నాయి. పై రుణగ్రహీతలు/ మరియు/లేదా వారి హామీదారులు (వర్తించినట్లుగా) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 యొక్క నియమాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవటంతో పాటు ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులు కాలవ్యవధిలోగా బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది.

తేది: మార్చ్ 30, 2024
ప్రదేశం: గుంటూరు

అధీకృత అధికారి
ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

Muthoot Homefin

**ముత్తూట్ హోమ్‌ఫిన్ (ఇండియా) లిమిటెడ్**

కార్పొరేట్ కార్యాలయం: యూనిట్ నం.19-ఎన్ఐ, 19వ అంతస్తు, ది రూబీ, సేనాపతి బాపత్ మార్గ్, రూపారెల్ కాలేజీ వద్ద, దాదర్ (పశ్చిమం), ముంబై, మహారాష్ట్ర-400 028.

**డిమాండ్ నోటీసు**

**(సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3(1)తో చదువుతూ సెక్యూరిటైజేషన్ ఆండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ ఆండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13 (2) క్రింద.**

దిగువసంతకందారు అయిన ముత్తూట్ హోమ్‌ఫిన్ (ఇండియా) లిమిటెడ్ (ఎమ్‌హెచ్‌ఐఎల్) యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13 (2) క్రింద ...

| క్ర. సం. | రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు)/హామీదారు పేరు/లోన్ ఖాతా నెం. | బకాయి మొత్తం (రూ.) | డిమాండ్ నోటీసు తేదీ | సెక్యూర్డ్ అసెట్ (స్థిరాస్తి) వివరణ |
|---|---|---|---|---|
| 1. | నాగరాజు రాజేశ్వరరావు కొట్ల/ లక్ష్మి నాగరాణి కొట్ల/050-05000009[illegible] | రూ.17,06,230/- [illegible] | 18-Mar-2024 | [illegible] ఆంధ్రప్రదేశ్-520007, కృష్ణ [illegible] |

తేదీ: 30 మార్చి, 2024
ప్రదేశం: కృష్ణ

సం/- అధీకృత అధికారి
ముత్తూట్ హోమ్‌ఫిన్ (ఇండియా) లిమిటెడ్

MOTILAL OSWAL HOME LOANS

**మోతీలాల్ ఒస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్**

కార్పొరేట్ ఆఫీసు: మోతీలాల్ ఒస్వాల్ టవర్, రహిమతుల్లా సయాని రోడ్, ఎస్‌టి డిపో ఎదురుగా, ప్రభాదేవి, ముంబయి-400025. ఇ-మెయిల్: hfquery@motilaloswal.com

**ఇ-వేలం మరియు అమ్మకం కొరకు బహిరంగ ప్రకటన**

| రుణగ్రహీతలు/హామీదారులు/రుణ ఖాతా | డిమాండ్ నోటీసు తేదీ & మొత్తం | స్థిరాస్తి వివరణ | రిజర్వు ధర, ధరావత్తు & ధరావత్తు పెంపుదల మొత్తం | ఇ-వేలం తేదీ & సమయం |
|---|---|---|---|---|
| [illegible] 190072828 [illegible] | 20.04.2021 & రూ.21,29,489/- [illegible] | ఫ్లాట్ నం.402, 3వ అంతస్తు [illegible] | రిజర్వు ధర: రూ.19,00,000/-; ధరావత్తు: రూ. 1,90,000/-; ధరావత్తు డిపాజిట్ చేయుటకు చివరి తేదీ: 18.04.2024 | తేదీ: 19.04.2024, ఉ.11:00గం.ల [illegible] |

https://BestAuctionDeal.com
care@BestAuctionDeal.com

ప్రదేశం: గుంటూరు
తేదీ: 30.03.2024

సం/- అధీకృత అధికారి
(మోతీలాల్ ఒస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్)

**మీ కోసం**

పన్నీరు ముక్కలను నీటిలో ఉడకబెట్టకుండా, కాసేపు వేడి నీటిలో ఉంచి తీస్తే దూదిముక్కల్లా మెత్తగా ఉంటాయి.

**జీవన సౌరభం**

అసమర్థులకు అవరోధాలుగా కనిపించేవి సమర్థులకు అవకాశాలుగా కనిపిస్తాయి.



## ఏమని పలికింది?



చిట్టి చిట్టి చిలకమ్మ
ఏమని పలికింది?
పొట్టి పొట్టి మాటలతో
రమ్మని పలికింది

చిన్ని చిన్ని ఉడతమ్మ
ఏమని పలికింది?
కొన్ని కొన్ని గింజలను
తిందాం రమ్మంది

బుజ్జి బుజ్జి బాతమ్మ
ఏమని పలికింది?
బుజ్జాయి బుజ్జాయి కథలను
విందాం రమ్మంది

సన్న సన్న నెమలమ్మ
ఏమని పలికింది?
సన్నాయి సన్నాయి పాటలతో
ఆడుదాం రమ్మంది!

**- కయ్యూరు బాలసుబ్రమణ్యం**
**77802 77240.**

## దారి చెప్పండి

**పిల్లలూ, ఈ బొమ్మలో కనిపిస్తున్న కోతిపిల్ల అరటిపళ్లను చేరుకోవాలి. కాస్త దారి చూపించరూ?**

## నేను గీసిన బొమ్మ

**సి.హెచ్. శతర్ష,**
**1వ తరగతి,**
**శ్రీ చైతన్య టెక్నో స్కూల్,**
**తిరువూరు, ఎన్టీఆర్ జిల్లా.**

**పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ:** chinnaarips@gmail.com

# మట్టి నుంచి మహాద్భుతంగా ...

**మట్టి మనకు అన్నీ ఇస్తుంది. కడుపు నింపుతుంది. బతకటానికి జాగాను ఇస్తుంది. బతుకు దెరువుకు తోవ చూపిస్తుంది. అదే మట్టితో ఎందరో కుమ్మరి వృత్తిదారులు మట్టి పాత్రలను కళాత్మకంగా తయారు చేస్తున్నారు. విజయవాడ నుంచి విస్సన్నపేట వెళ్లే రూటులో కొత్తూరు తాడేపల్లిలో ఇలాంటి దృశ్యాలు కోకొల్లలు. ఇవి మనం రోజూ వాడుకునే వస్తువులే. వెరైటీ ఆకృతుల్లో, ఆకట్టుకునే డిజైన్లలో ఇక్కడ కొలువు తీరాయి.**

ఎన్టీఆర్ జిల్లా కొత్తూరు తాడేపల్లి పంచాయతీ పరిధిలోనికుమ్మరిపాలెంలో సుమారు 40 - 50 కుటుంబాల కుమ్మరి వృత్తిదారులు నివసిస్తున్నారు. ప్రతి ఇంట్లోనూ మట్టి పాత్రల తయారీ యూనిట్లు ఉన్నాయి. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ మట్టి పాత్రల తయారీలోనే ఆయా కుటుంబాల్లోని పిల్లల నుంచి పెద్దల వరకూ ఉంటారు.

కుండల తయారీకి చెరువుల్లో ఉండే బంకమట్టి ప్రధాన ఆధారం. అక్కడి నుంచి మట్టిని తమ ఇళ్ల వద్దకు తెచ్చి, ఎండబెట్టి, జల్లెడ పట్టిన తర్వాత ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన గుంతల్లో ఒకరోజు నిల్వ వుంచుతారు. ఆ తర్వాత ఆ మట్టిని మిషన్‌లో వేయటం ద్వారా బాగా మెత్తగా అవుతుంది. ఆ తర్వాత దానిని మోటారు డిమ్మర్ ద్వారా చక్రంపై ఉన్న సారె ద్వారా తయారుచేసిన మట్టి వేసి వివిధ పాత్రల ఆకారం తెస్తారు. వాటిని ఎండబెట్టి మళ్లీ తుది మెరుగులు దిద్దుతారు. తర్వాత వాటిని బట్టీల్లో ఉంచి కాలుస్తారు. తుది రూపం తర్వాత రంగులు వేస్తారు. ఇదంతా క్రమ పద్ధతిలో జరగాల్సిందే. ప్రతిరోజూ యంత్రంపై ఒక్కొక్కరు 30 - 35 వరకూ పాత్రలు తయారు చేయొచ్చు. ఇలా తయారు చేసిన కుండలు, కూజాలు, కుందెలు, ముంతలు (డబ్బుల దిబ్బీలు), ఆహార పదార్థాలు తయారు చేసుకునే గిన్నెలు, వాటర్‌బాటిల్, కూరగిన్నెలు, మూకుడులు, ప్రమిదలు, అలంకార వస్తువులు, కూలకుండీలు వంటివి విక్రయానికి వీలుగా రోడ్లపైనా, తమ ఇళ్ల ఆవరణలోనూ పేర్చేస్తారు.

**పెట్రో, కరెంట్ ఛార్జీలు భారం**

పెరిగిన పెట్రోలు ఛార్జీల ప్రభావం కుండలు తయారుచేసే వృత్తిదారులపైనా పడింది. గతంలో ట్రాక్టరు మట్టి చెరువు నుంచి ఇంటికి తోలటానికి రూ.400 నుంచి రూ.500 ఉండేది. ఇప్పుడు రూ. 1500 నుంచి రూ.2000 వరకూ అవుతుంది. గతంలో రూ.300 - రూ.400 మధ్య వచ్చే కరెంట్ బిల్లులు ఇప్పుడు రూ.750 వరకూ వస్తున్నాయి. గతంలో చేతితో సారెపై పనిచేసేవారు. ఇప్పుడు రూ.30 వేలు నుంచి రూ.40 వేల వ్యయం చేసి డమ్మర్ మోటార్లను వాడుతున్నారు. ఇసుకను ట్రాక్టర్‌కు రూ.8000, కలప టన్ను రూ.3000, ఊక బస్తా రూ.200 చొప్పున కొనుగోలు చేయాల్సి వస్తుందని వృత్తిదారులు వివరించారు. ఇవన్నీ కలిపి తయారీ వ్యయాన్ని భారీగా పెంచాయని చెబుతున్నారు.

**కొనుగోళ్లు అంతంతే!**

ఒకప్పుడు ఈ పాత్రల కొనుగోళ్లు బ్రహ్మాండంగా సాగేవి. ఇప్పుడు ఒక్కో ఇంటి వద్ద రోజుకు ఐదు నుంచి ఆరు కుండలు అమ్ముడు పోవటం గగనంగా మారుతోందని వృద్ధురాలు సుంకర లచ్చమ్మ వాపోయారు. సమీపంలోని వెలగలేరు, వెల్లటూరు, గణపవరం, విజయవాడ భవానీపురం గట్టు వెనక ప్రాంతం కుమ్మరిపాలెం, కొత్తపేటలలో కుండల తయారుచేసే వారు ఉన్నారు. అయితే ఇతర ప్రాంతాల వారు తమ వద్ద నాణ్యమైన పనిముట్లు తయారవుతాయని భావించి చాలామంది తమ వద్ద కొనుగోలు చేస్తుంటారని లచ్చమ్మ తెలిపారు.

**- యడవల్లి శ్రీనివాసరావు**

### మట్టిపాత్రల వినియోగం పెరిగింది

నా వయస్సు 70 సంవత్సరాలు. మానాన్న బెజ్జంకి బసవయ్య, అమ్మ సీతామహాలక్ష్మి ఇదే వృత్తిలో కొనసాగారు. అదే వారసత్వాన్ని కొనసాగిస్తున్నాం. గతంలో ప్రతి ఇంట్లోనూ వంటపాత్రలుగా మట్టివి వాడేవారు. కుప్ప నూర్పిళ్ల సమయంలో రైతులు ఆరేడు మానికల ధాన్యం ఇచ్చేవారు. ఏడాది పొడవునా ఏ అవసరం ఉన్నా పాత్రలు తీసుకెళ్లేవారు. ఇప్పుడు మళ్లీ ఆరోగ్యం రీత్యా చాలామంది మట్టి పాత్రలవైపు చూస్తున్నారు. ఇది మా పరిశ్రమకు మంచి పరిణామమే!

**-బెజ్జంకి మల్లికార్జునరావు**

### మట్టి సమస్యగా ఉంది

తరతరాలుగా ఇదే వృత్తిపై మా కుటుంబాలన్నీ ఆధారపడి జీవిస్తున్నాయి. పిల్లల నుంచి పెద్దల వరకూ భాగస్వామ్యం కానిదే ఈ తయారీ పని జరగదు. ఉదయం 6 నుంచి రాత్రి 12 గంటల వరకూ ఏదో ఒక రూపంలో పని చేయాల్సివుంటుంది. గతంలో చేతివృత్తిలో భాగంగా చెరువులో మట్టి తెచ్చుకోవటానికి అనుమతి ఉంది. గతేడాది అధికారులు మట్టి తెచ్చుకోవటానికి ఆంక్షలు పెట్టి, ఇబ్బందులు పెట్టారు. మట్టి తెచ్చుకోవటానికి ఇబ్బందులు కల్గిస్తే మా వృత్తికే ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది.

**- శెనగవరపు దుర్గారావు**

### తెలంగాణా నుంచి ఎక్కువ ఆదరణ

కొత్తూరు తాడేపల్లిలో తయారయ్యే కుండలు, కూజాలు, ముంతలు, ఇతర మట్టి పాత్రలకు తెలంగాణా రాష్ట్రంలోని హుజూరాబాద్, మిర్యాలగూడ, సూర్యాపేట, మధిర, కోదాట, ఖమ్మం, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఇక్కడ మా వద్ద గుంపగుత్తగా కొనుక్కుని అక్కడికి తీసుకెళ్లి వారి ప్రాంతాల్లో కొంత లాభంతో అమ్ముకుంటారు. తెలంగాణా శుభ, అశుభ కార్యాల్లో ఎక్కువగా మట్టి పాత్రల వినియోగం ఉంటుంది.

**- కానోళ్ల శివలక్ష్మి**

### జీవితాలు మారటం లేదు

తరతరాలుగా ఇదే వృత్తిలో కొనసాగుతున్నాం. ప్లాస్టిక్, ఇనుము, రాగి, పింగాణి, స్టీలు వంటి పనిముట్లు వచ్చాక మా పనులు తగ్గాయి. ఇప్పుడు వాటి దుష్ఫలితాలు తెలుసుకుంటున్న ప్రజానీకం మళ్లీ మట్టిపాత్రలను ఆశ్రయిస్తున్నారు. అయితే కొనుగోళ్లు ఇంకా చాలా తక్కువగానే ఉంటున్నాయి. ప్రభుత్వాలు రుణాలు ఇచ్చి ప్రోత్సహిస్తే మా జీవితాలు కూడా బాగుపడతాయి.

**- బెజ్జంకి లక్ష్మణరావు**

## ఏప్రిల్ 12న తెలుగు 'డియర్'

తమిళ సంగీత దర్శకుడు జివి ప్రకాష్ కుమార్ హీరోగా, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్‌గా 'డియర్' అనే సినిమా తెరకెక్కింది. ఈ సినిమాకి ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. నట్‌మెగ్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కి చెందిన వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, జి పృథ్వీరాజ్ నిర్మించగా తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నారు. తమిళ వెర్షన్ ఏప్రిల్ 11న విడుదల కానుండగా, తెలుగు వెర్షన్ ఏప్రిల్ 12న విడుదల కానుంది. ఈ సినిమా ఆంధ్రా థియేట్రికల్ హక్కులు అన్నపూర్ణ స్టూడియోస్ కొనుగోలు చేయగా, ఏషియన్ సినిమాస్ తెలంగాణ థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకుంది. ఈ చిత్రానికి సంగీతం కూడా జివి ప్రకాష్ కుమార్ అందించారు.

## 'గోట్' సినిమాలో ధోని?

తమిళ హీరో విజయ్ నటిస్తున్న సినిమా 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (గోట్)'. వెంకట్‌ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. మీనాక్షి శేషాద్రి, స్నేహ, లైలా, మైక్ మోహన్, జయరామ్, ప్రశాంత్, ప్రభుదేవా, అజ్మల్, వైభవ్, యోగిబాబు, ప్రేమ్‌జీ తదితరులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఇందులో స్టార్ క్రికెటర్ మహేంద్ర ధోని అతిథి పాత్రలో కనిపించనున్నట్లుగా సమాచారం. ఈ చిత్రంలో విజయ్ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. విదేశాల్లో చిత్రీకరణ పూర్తిచేసుకుని ఈ చిత్ర యూనిట్ చెన్నైకు వచ్చింది.

## ప్రతినిధి-2 టీజర్ విడుదల

హీరో నారా రోహిత్ నటించిన 'ప్రతినిధి' సినిమాకు సీక్వెల్‌గా 'ప్రతినిధి-2' త్వరలో విడుదల కానుంది. జర్నలిస్ట్ మూర్తి దేవగుప్తాపు దర్శకత్వం వహించారు. వానరా ఎంటర్‌టైన్‌మెంట్స్, రానా ఆర్ట్స్ బ్యానర్లపై కుమార్ రాజా బత్తుల, ఆంజనేయులు శ్రీ తోట, సురేంద్రనాథ్ బొల్లినేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టీజర్‌ను హీరో చిరంజీవి శుక్రవారం విడుదల చేశారు. టీజర్‌లో సచిన్ ఖేడేకర్, రఘుబాబు, జిషు సేన్ గుప్తా, ఉదయభాను, అజయ్ ఘోష్, శ్రీ ఇతర ముఖ్య పాత్రలను కూడా పరిచయం చేశారు. నాని చమిడిశెట్టి కెమెరామెన్‌గానూ, మహతి స్వరసాగర్ సంగీతాన్ని అందించారు. వచ్చే నెల ఈ సినిమా విడుదల కానుంది.

## 'శ్రీరంగనీతులు' ట్రైలర్

సుహాస్, కార్తీక్‌రత్నం, రుహాని శర్మ, విరాజ్ అశ్విన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'శ్రీరంగ నీతులు'. ఈ సినిమాకు ప్రవీణ్‌కుమార్ వీఎస్ఎస్ దర్శకత్వం వహిస్తున్నారు. రాధావి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై వెంకటేశ్వరరావు బల్మూరి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. తాజాగా ఈ చిత్రం నుంచి చిత్రబృందం ట్రైలర్ విడుదల చేసింది. 'త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అని తెలిపింది.

## బుల్లితెర నటుడు వీరభద్రరావు మృతి

బుల్లితెర, వెండితెర అనే తేడా లేకుండా ఎన్నో పాత్రల్లో నటించి తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటుడు వీరభద్రరావు చనిపోయారు. రెండు నెలల క్రితం ప్రమాదవశాత్తూ కింద పడిపోయిన ఆయన.. అప్పటి నుంచి కోమాలోనే ఉన్నారు.

ఈ క్రమంలోనే శుక్రవారం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. టీవీ సీరియల్స్, సినిమాలు ఎన్నో పాత్రలు చేసిన ఆయన మరణం పట్ల సినీ ప్రముఖుల, టీవీ నటులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## 'మెకానిక్ రాకీ' ఫస్ట్‌లుక్ విడుదల

హీరో విశ్వక్‌సేన్ పుట్టినరోజు సందర్భంగా తను నటిస్తున్న 'మెకానిక్ రాకీ' ఫస్ట్‌లుక్‌ను శుక్రవారంనాడు విడుదల చేశారు. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో నిర్మాత తాళ్లూరి ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి హీరోయిన్. జేక్స్ బిజోయ్ సంగీతాన్ని అందించారు. మనోజ్ కటసాని డిఓపిగా, అన్వర్ ఆలీ ఎడిటర్‌గా, క్రాంతి ప్రియం ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. సత్యం రాజేష్, విద్యాసాగర్ జె ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు.

# కూల్‌గా కొట్టేశారు..

- బెంగళూరుపై ఏడు వికెట్ల తేడాతో కోల్‌కతా గెలుపు
- నైట్‌రైడర్స్ ఖాతాలో రెండో విజయం

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్
సునీల్ నరైన్ (47పరుగులు)

**బెంగళూరు:** ఐపిఎల్ 2024 సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ హవా కొనసాగుతోంది. తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్‌పై సంచలన విజయం సాధించిన కోల్‌కతా.. శుక్రవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) నిర్దేశించిన 183పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. ఛేదనలో భాగంగా కోల్‌కతా ఓపెనర్లు సాల్ట్(30), నరైన్(47) తొలి వికెట్‌కు 6.3ఓవర్లలో 86పరుగుల పునాది వేశారు. వీరిద్దరి నిష్క్రమణ తర్వాత వెంకటేశ్ అయ్యర్(50) అర్ధసెంచరీకి తోడు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(39నాటౌట్) మ్యాచ్‌ను ముగించారు. దీంతో కోల్‌కతా జట్టు 16.5ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 186పరుగులు చేసి ఈ సీజన్‌లో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీకి ఆరంభంలోనే షాక్ తగిలింది. రెండో ఓవర్‌లోనే హర్షిత్ రాణా బౌలింగ్‌లో డుప్లెసిస్ (6 బంతుల్లో 8పరుగులు) ఔటయ్యాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ దూకుడుగా ఆడాడు. విరాట్ కోహ్లి(83నాటౌట్; 59బంతుల్లో 4ఫోర్లు, 4సిక్సర్లు) ఒంటరి పోరాటం చేశాడు. టాపార్డర్, మిడిలార్డర్ విఫలమైనా అతడు ఒంటరి పోరుతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు భారీ స్కోర్‌ను అందించాడు. కామెరూన్ గ్రీన్ (21బంతుల్లో 33పరుగులు) కాసేపు నిలకడగా ఆడాడు. కానీ 9వ ఓవర్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ఇక మిడిలార్డర్ పూర్తిగా విఫలమయ్యింది. గ్లెన్ మ్యాక్స్‌వెల్ (19బంతుల్లో 28) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలబడలేకపోయాడు. రజత్ పాటిదార్ (3), అనుజ్ రావత్ (3) ఏ మాత్రం ప్రభావం చూపలేక పోయారు. చివర్లో దినేశ్ కార్తిక్ (8బంతుల్లో 20పరుగులు) దూకుడుగా మొదలుపెట్టినప్పటికీ.. ఆఖరి బంతికి రనౌట్ అయ్యాడు. విరాట్ కోహ్లి (59బంతుల్లో 83పరుగులు) ఒక్కడే మొదట్నుంచి చెలరేగి ఆడాడు. ఫలితంగా ఆరు వికెట్ల నష్టానికి ఆర్సీబీ 182 పరుగులు చేసింది. కోల్‌కతా ముందు 183 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. కోల్‌కతా బౌలర్లలో హర్షిత్ రాణా, ఆండ్ర్యూ రస్సెల్ చెరో 2 వికెట్లు తీశారు. సునీల్ నరైన్‌కు ఒక వికెట్ దక్కాయి.

**స్కోర్‌బోర్డు..**

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్:** కోహ్లి (నాటౌట్) 83, డుప్లెసిస్ (సి)స్టార్క్ (బి)హర్షిత్ రాణా 8, గ్రీన్ (బి)రస్సెల్ 33, మ్యాక్స్‌వెల్ (సి)రింకు సింగ్ (బి)నరైన్ 28, రజత్ పటీధర్ (సి)రింకు సింగ్ (బి)రస్సెల్ 3, అనుజ్ రావత్ (సి)సాల్ట్ (బి)హర్షిత్ రాణా 3, దినేశ్ కార్తీక్ (రనౌట్) సాల్ట్ 20, అదనం 4. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 182పరుగులు. **వికెట్ల పతనం:** 1/17, 2/82, 3/124, 4/144, 5/151, 6/182 **బౌలింగ్:** స్టార్క్ 4-0-47-0, హర్షిత్ రాణా 4-0-39-2, అనుకుల్ రాయ్ 2-0-6-0, సునీల్ నరైన్ 4-0-40-1, రస్సెల్ 4-0-29-2, వరణ్ చక్రవర్తి 2-0-20-0.

**కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్:** సాల్ట్ (సి)గ్రీన్ (బి)వి. వ్యాషక్ 30, నరైన్ (సి)మయాంక్ దగర్ 47, వెంకటేశ్ అయ్యర్ (సి)కోహ్లి (బి)యశ్ దయాల్ 50, శ్రేయస్ అయ్యర్ (నాటౌట్) 39, రింకు సింగ్ (నాటౌట్) 5, అదనం 15. **వికెట్ల పతనం:** 1/86, 2/92, 3/167 **బౌలింగ్:** సిరాజ్ 3-0-46-0, యశ్ దయాల్ 4-0-46-1, జోసెఫ్ 2-0-34-0, యశ్ దగర్ 2.5-0-23-1, వ్యాషక్ 4-0-23-1, గ్రీన్ 1-0-7-0

**ఐపిఎల్‌లో నేడు**

లక్నో సూపర్‌జెయింట్స్
×
పంజాబ్ కింగ్స్

**వేదిక: లక్నో: రా.7.30గం॥లకు**

## ఎన్‌ఓసికి విహారి దరఖాస్తు

**విశాఖపట్నం:** ఆంధ్ర క్రికెటర్ హనుమ విహారి తాజాగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఎసిఎ) నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్‌ఓసి)కి దరఖాస్తు చేసుకున్నాడు. గురువారం విహారికి ఎసిఎ షోకాజ్ నోటీస్ జారీ చేసిన నేపథ్యంలో విహారి తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. రంజీట్రోఫీ మధ్యలో అర్ధాంతరంగా కెప్టెన్సీ పదవినుంచి తొలగించడంపై అప్పుడే ఎసిఎకు విహారి లేఖ రాశాడని తెలిసింది. దానికి సమాధానంగా ఎసిఎ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఆ లేఖపై చర్చ నడిచినట్లు.. దానిపై అప్పుడే వివరణ కూడా ఇచ్చినట్లు ఎసిఎ వాదన. కానీ సోషల్ మీడియా వేదికగా విహారి రంజీట్రోఫీ సీజన్ ముగిసిన తర్వాత సమస్యను మరింత జఠిలం చేసేలా ప్రకటనలు చేశారని, ఇది సరైన చర్య కాదని ఎసిఎ ఇటీవల విహారికి షోకాజ్ నోటీసు జారీచేసింది. ఇక 2023-24 రంజీ సీజన్‌కు ముందు విహారి ఆంధ్ర నుంచి మధ్యప్రదేశ్ తరఫున ఆడాలనే ఉద్దేశ్యంతో ఎన్‌ఓసికి దరఖాస్తు చేసుకున్నా.. ఎసిఎ అనుమతించలేదని తెలిసింది.

## ఫైనల్‌కు బొప్పన్న జోడి

**మియామీ ఓపెన్ టెన్నిస్ టోర్నీ**

**న్యూయార్క్:** మియామీ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ ఫైనల్లోకి రోహన్ బొప్పన్న జంట దూసుకెళ్లింది. గురువారం రాత్రి జరిగిన సెమీస్‌లో బొప్పన్న-ఎబ్డన్ జంట 6-1, 6-3తో 4వ సీడ్ ఎం.గానోలర్స్(స్పెయిన్)-జెలాలోస్(అర్జెంటీనా) జంటను చిత్తుచేశారు. వరుస సెట్లలో ప్రత్యర్థులను చిత్తుచేసి ఫైనల్లోకి దూసుకెళ్లిన వీరు 2వ సీడ్ అమెరికాకు చెందిన క్రాజిసెక్-క్రొయేషియాకు చెందిన డోడిగ్‌లతో టైటిల్‌కై తలపడనున్నారు. బొప్పన్న జోడీ 2 ఏస్‌లను సంధించగా.. మొదటి సర్వీసులను 91శాతం నిలబెట్టుకొన్నారు. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను నెగ్గి అద్భుత ఫామ్‌లో ఉన్న ఇండో-ఆస్ట్రేలియన్ జంట ప్రపంచ ర్యాంకింగ్స్‌లోనూ 2వ స్థానంలో ఉన్నారు. ఈ టోర్నమెంట్‌లో వీరు టాప్‌సీడ్‌గా బరిలోకి దిగారు. మరో సెమీస్‌లో క్రాజిసెక్-డోడిగ్ 7-6(7-1), 7-6(7-4)తో రోజర్(ఫ్రాన్స్)-మెలో(బ్రెజిల్)లను ఓడించి ఫైనల్‌కు చేరారు. ఇక పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్, స్పెయిన్‌కు చెందిన అల్కరాజ్ పోరాటం ముగిసింది. క్వార్టర్‌ఫైనల్లో అల్కరాజ్ 2-6, 4-6తో 11వ సీడ్, బల్గేరియాకు చెందిన డిమిత్రోవ్ చేతిలో అనూహ్యంగా పరాజయాన్ని చవిచూశాడు. సెమీస్‌లో మెద్వదెవ్‌తో సిన్నర్, డిమిత్రోవ్‌తో జ్వెరేవ్ తలపడనున్నారు. ఇక మహిళల సింగిల్స్‌లో టైటిల్‌పోరు 4వ సీడ్ రైబకినా(కజకిస్తాన్), కాలిన్స్(అమెరికా) మధ్య జరగనుంది.


Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68